
కారల్ మార్క్స్ పెట్టుబడి గ్రంథం

పుట్టుక, నిర్మాణం



మార్సెల్లో మస్త్రో

అనువాదం

సుంకర రామచంద్రరావు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

కారల్ మార్క్స్ పెట్టుబడి గ్రంథం : పుట్టుక, నిర్మాణం

మార్సెల్లో మస్త్రో

అనువాదం

సుంకర రామచంద్రరావు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజయవాడ

Karl Marx Pettubadi Grandham : Puttuka, Nirmanam

– by : **Marcello Musto,** Translated by : **Sunkara Ramachandra Rao**

ప్రచురణ నెం. : 2350/752

ప్రతులు : 1,000

ప్రథమ ముద్రణ : జనవరి, 2022

టైటిల్ డిజైన్ : గిరిధర్

© రిజర్వ్‌డ్

వెల : ₹ 30/-

ప్రతులకు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520 004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

విశాలాంధ్ర బుక్‌హౌస్
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు,
తిరుపతి, కాకినాడ, ఒంగోలు,
శ్రీకాకుళం, కడప, విజయనగరం.

హెచ్చరిక : ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ

విషయసూచిక

1. గ్రుంద్రిజె (Grundrisse) మొదలుకొని 5

   అదనపు విలువ సిద్ధాంతాల విమర్శనాత్మక విశ్లేషణ వరకు

2. మూడు వాల్యూమ్‌లు రాయటం 20

3. వాల్యూమ్ 1 పూర్తి చేయడం 27

4. నిర్ణయాత్మక వ్యక్తీకరణ కోసం అన్వేషణ 37

1

గ్రుండ్రిజె (Grundrisse) మొదలుకొని అదనపు విలువ సిద్ధాంతాల విమర్శనాత్మక విశ్లేషణ వరకు

రాజకీయ అర్థశాస్త్రాన్ని నిశితంగా అధ్యయనం చేసిన తరువాత అనేక సంవత్సరాలకు మార్క్స్ **పెట్టుబడి** గ్రంథాన్ని రాయడం ప్రారంభించాడు. ఆయన 1843 నాటికే ఈ అధ్యయనం ప్రారంభించాడు. తనదైన ఆర్థిక అవగాహన సాధించడానికి ఈ అధ్యయనం దోహదం చేసిందని ఆయన కొంతకాలం తరువాత స్పష్టం చేశాడు. 1857లో హఠాత్తుగా సంభవించిన ఆర్థిక సంక్షోభం మార్క్స్‌ను పెట్టుబడి గ్రంథం రాయటానికి పురికొల్పింది. అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న సంక్షోభం యూరోప్ అంతటా నూతన విప్లవ దశకు అవసరమైన పరిస్థితులను సృష్టిస్తుందని మార్క్స్ భావించాడు. 1848లో తిరుగుబాట్లు జరిగిన తరువాత ఇటువంటి క్షణం కోసమే ఆయన ఎదురు చూస్తున్నాడు. చివరకు ఆ క్షణం రానే వచ్చింది. సంఘటనలు హఠాత్తుగా తనను చుట్టుముట్టడం ఆయనకు ఇష్టం లేదు. అందువల్ల ఆర్థికాంశాల అధ్యయనం తిరిగి కొనసాగించాలని, దానికి పుస్తక రూపం ఇవ్వాలని ఆయన నిర్ణయించుకున్నాడు.

మార్క్స్ తన జీవితంలో విస్తారంగా రాసిన కాలం ఇది. అంతకుముందు సంవత్సరాలలో రాసిన దానికన్నా చాలా ఎక్కువగా కొద్ది నెలల్లోనే రాయగలిగాడు. 1857, డిసెంబర్‌లో ఆయన ఎంగెల్స్‌కు రాసిన లేఖలో, "నేను రాత్రింబవళ్లు పిచ్చి పట్టిన వాడిలాగా పనిచేస్తున్నాను. ప్రతి రాత్రి నా ఆర్థిక అధ్యయనాలను సరిచూసుకుంటున్నాను. ఆ విధంగా ప్రళయం రాకముందే, రేఖామాత్రపు అవగాహనకు (గ్రుండ్రిజె) రావాలని ప్రయత్నిస్తున్నాను" అని తెలిపాడు.

అప్పుడు మార్క్స్ చేసిన కృషి విస్తృతమైనది, చెప్పుకోదగినది. 1857 ఆగస్టు నుంచి 1858 మే వరకు ఆయన గ్రుండ్రిజె అని ఎనిమిది నోట్ బుక్స్‌ను నింపేసాడు. అప్పుడు ఆయన న్యూయార్క్ ట్రిబ్యూన్ (అమెరికాలో అత్యంత ఎక్కువ సర్క్యులేషన్ ఉన్న పత్రిక. 1851 నుంచి మార్క్స్ ఈ పత్రికకు కరస్పాండెంట్‌గా పని చేశాడు.) కరస్పాండెంట్‌గా

పనిచేస్తూ పెరుగుతున్న సంక్షోభం, తదితర అంశాలకు సంబంధించి వ్యాసాలు కూడా రాశాడు. 1857 అక్టోబర్ నుంచి 1858 ఫిబ్రవరి వరకు ఆయన సంక్షోభంపై మూడు నోట్ బుక్స్ నింపగలిగాడు. వీటిలో అర్థశాస్త్ర గ్రంథాల నుంచి సేకరించిన సమాచారం ఉంది. సాంప్రదాయకంగా హెగెల్ రాసిన 'సైన్స్ ఆఫ్ లాజిక్' అధ్యయనం చేసే మార్క్స్ 1857–58 నాటి రాతప్రతులు రూపొందించే వ్యక్తిగా మారిపోయాడు. పెద్ద ఎత్తున సంక్షోభం రాబోతున్నదని చాలాకాలంగా ఊహిస్తున్నందువల్ల దానికి సంబంధించిన సమాచారంపై దృష్టి కేంద్రీకరించాడు. ఆర్థిక శాస్త్రవేత్తల గ్రంథాల నుంచి సమాచారం సేకరించే పద్ధతి కాకుండా, సంక్షోభం పెరిగే దిశలో కనిపించే అంశాలపై, అనేక దిన పత్రికల సమాచారంతో భారీ మొత్తంలో రూపొందించిన నోట్స్ వీటిలో ఉంది. స్టాక్ మార్కెట్ ధోరణి, విదేశీ వాణిజ్యం చెల్లింపులలో హెచ్చు తగ్గులు; యూరోప్ , అమెరికాలతో పాటు ప్రపంచంలోని ఇతర దేశాలలో కొనసాగుతున్న పెద్ద పెద్ద దివాళాల వివరాలు నోట్స్‌లో ఉన్నాయి. ఆయన డిసెంబర్‌లో ఎంగెల్స్‌కు రాసిన లేఖనుబట్టి ఆయన ఎంత తీవ్రంగా పనిచేస్తున్నది అర్థమవుతుంది :

నేను ఒక నియమం పెట్టుకొని ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటల వరకు అపరిమితమైన కృషి చేస్తున్నాను. రెండు విధాలుగా నేను కృషి చేస్తున్నాను. 1. రాజకీయ అర్థశాస్త్రాన్ని సంక్షిప్తంగా వివరించడం. (ప్రజల ప్రయోజనం దృష్ట్యా ఇది తప్పనిసరిగా చేయవలసింది. ఇందులో చిట్టచివరి లేదా అట్టడుగు అంశాలను కూడా వివరించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇది నా వ్యక్తిగత స్పష్టతకు కూడా తప్పనిసరి. ఈ పగటి కలలు వదిలించుకోవాలంటే ఇవన్నీ తప్పనిసరి.) 2. ప్రస్తుత సంక్షోభం. దీనికి సంబంధించి న్యూయార్క్ ట్రిబ్యూన్‌లో రాస్తున్న వ్యాసాలను జాగ్రత్త చేస్తున్నప్పటికీ అది చాలా ఎక్కువ సమయం తీసుకుంటూనే ఉంది. వసంత రుతువు నాటికి మనిద్దరం కలిసి దీనికి సంబంధించి ఒక కరపత్రం రూపొందించడం అవసరం అని నేను అనుకుంటున్నాను.

గ్రుండ్రిజెను మూడు భాగాలుగా విభజించారు : మొదటిది పద్ధతికి సంబంధించిన ఉపోద్ఘాతం. రెండో భాగంలో ద్రవ్యం గురించి చర్చించారు. ద్రవ్యం, విలువపై ఇందులో వివరణ ఇచ్చారు. మూడో భాగంలో పెట్టుబడిని విశ్లేషించారు. పెట్టుబడి ఉత్పత్తి, దాని చలామణి, అదనపు విలువ, పెట్టుబడిదారీ విధానానికి పూర్వం ఉన్న ఆర్థిక నిర్మాణాలు, తదితర కీలక అంశాలను ఇందులో ప్రస్తావించారు. మార్క్స్ చాలా తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఆ పని పూర్తి చేయడం సాధ్యం కాలేదు. 1858 ఫిబ్రవరి చివరిలో ఆయన లాసెల్లేకి ఈ విధంగా లేఖ రాశాడు :

'నిజానికి, గత కొద్ది నెలలుగా నా పనిలో వివిధ అంశాలకు సంబంధించి తుది అవగాహనకు వచ్చినట్టుగానే అనిపిస్తుంది. కానీ అది చాలా నెమ్మదిగా నడుస్తున్నది. కారణమేమిటంటే, సంవత్సరాల తరబడి అధ్యయనం చేస్తున్నందువల్ల 'తుది అవగాహనకు చేరుకుంటున్నాను' అని అనుకుంటుండగానే ఆయా అంశాలకు సంబంధించి నూతన కోణాలు ఆవిష్కారమవుతున్నాయి. వాటి గురించి మరింతగా ఆలోచించవలసిన అవసరం ఏర్పడుతున్నది. (...) నేను ప్రస్తుతం ఆర్థిక భావాల (categories) విమర్శనాత్మక పరిశీలన (critique) చేస్తున్నాను. లేదా కావాలనుకుంటే, బూర్జువా ఆర్థిక విధానాన్ని విమర్శ నాత్మకంగా బట్టబయలు చేస్తున్నాను. అది ఒకవైపు బట్టబయలు చేయడం, రెండోవైపు వ్యవస్థపై విమర్శనాత్మక పరిశీలన. ఇదంతా ఎన్ని పేజీలు (...) వస్తుందనేది కూడా నాకు ఇంకా స్పష్టత లేదు. 15 సంవత్సరాల పాటు అధ్యయనం చేసిన తర్వాత నేను ఈ పని మొదలుపెట్టాను. ఇదిలా ఉండగా బయట జరిగే ఉద్యమాలు లేదా సంక్షోభాలు నా ప్రమేయం లేకుండా ఆటంకపరుస్తాయనే శంక నాలో లేకపోలేదు.'

అయితే సంక్షోభంతో పాటు వచ్చి తీరుతుందని ఎదురుచూస్తున్న విప్లవోద్యమ జాడ మాత్రం కనిపించడం లేదు. ప్రస్తుత సంక్షోభంపై పుస్తకం రాయాలనే ఆలోచనను కూడా మార్క్స్ పక్కన పెట్టేసాడు. అయినప్పటికీ తాను అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నప్పటికీ అది పూర్తి చేయలేకపోయాడు. ఎందువల్లనంటే రాతప్రతులలో ప్రస్తావించిన ఆలోచనలకు సంబంధించి కచ్చితమైన భావాలను రూపొందించడానికి ఇంకా చాలా దూరంలో ఉన్నట్టు ఆయన గ్రహించగలిగాడు. అందువల్ల అది ముసాయిదాగానే మిగిలిపోయింది. అయితే ఈ ముసాయిదాలోని ద్రవ్యం చాప్టర్ నుంచి ఆయన 1859లో 'ఏ కంట్రిబ్యూషన్ టు ది క్రిటీక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' అనే పేరుతో చిన్న పుస్తకాన్ని అచ్చువేశారు. అయితే ప్రజల నుంచి ఎటువంటి స్పందన రాలేదు.

1861 ఆగస్టు నుంచి మార్క్స్ మరోసారి రాజకీయ అర్థశాస్త్రం విమర్శనాత్మక పరిశీలనపై తీవ్రంగా కృషి చేశాడు. 1863 జూన్ నాటికి 23 పెద్ద నోట్ బుక్స్ రాశాడు. ద్రవ్యం పెట్టుబడిగా మార్పు చెందడం, వాణిజ్య పెట్టుబడి, అన్నిటినీ మించి అదనపు విలువపై ఆర్థిక శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన వివిధ రకాల సిద్ధాంతాలు ఈ నోట్ బుక్స్‌లో ఉన్నాయి. రాజకీయ అర్థశాస్త్ర విమర్శనాత్మక పరిశీలన సమగ్రంగా రూపొందించాలని ఆయన లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అంటే ఆయన చేసిన కృషిలో అది మొదటి భాగం అవుతుంది. 1859లో ప్రచురించిన ఈ పుస్తకంలో మొదట వినియోగ వస్తువు పేరుతో రాసిన చిన్న చాప్టర్‌లో ఉపయోగపు విలువ, మారకపు విలువ మధ్య తేడాలను

వివరించాడు. ద్రవ్యం లేదా సాధారణ ద్రవ్య చలామణిని వివరిస్తూ ద్రవ్య సిద్ధాంతాలన్నిటిని ప్రస్తావించాడు. ఆ పుస్తకం ముందు మాటలో 'నేను పెట్టుబడి, భూమి సంబంధమైన ఆస్తి, వేతన శ్రమ, రాజ్యాంగ యంత్రం, విదేశీ వాణిజ్యం, ప్రపంచ మార్కెట్ భావాల పరమైన వరుసక్రమంలో బూర్జువా విధానాన్ని పరిశీలించాను' అని మార్క్స్ వెల్లడించాడు.

రెండు సంవత్సరాల తరువాత కూడా మార్క్స్ ప్లాన్‌లో ఎటువంటి మార్పు లేదు. 1859లో రూపొందించుకున్న అంశాల జాబితా ప్రకారం ఆరు పుస్తకాలు రాయాలనే ఆలోచనతోనే ఉన్నాడు. ఏది ఏమైనప్పటికీ 1861 వేసవి నుంచి 1862 మార్చి వరకు 'క్యాపిటల్ ఇన్ జనరల్' అనే చాప్టర్‌ను ఆయన కొత్తగా రాశాడు. అచ్చు వేయదలచుకున్న పుస్తకంలో దీనిని మూడో చాప్టర్‌గా చేర్చాలని భావించాడు. ఆయన రాసిన ముసాయిదాలోని 23 నోట్ బుక్స్‌లలో మొదటి 5 నోట్ బుక్స్ దీనికి సంబంధించినవే. దీనిలో పెట్టుబడి ఉత్పత్తి క్రమంపై ప్రత్యేకించి దృష్టి సారించాడు. వీటితోపాటు 1) ద్రవ్యం పెట్టుబడిగా మారుతున్న తీరు, 2) అఖండ అదనపు విలువ, 3) సాపేక్ష అదనపు విలువ అనే అంశాలు వీటిలో ఉన్నాయి. వీటిలో కొన్ని భావాలను గ్రుండ్రిజెలోనే రాసినప్పటికీ ప్రస్తుతం వాటిని మరింత కచ్చితంగా, మరింత విశ్లేషణాత్మకంగా రాశాడు.

సంవత్సరాల తరబడి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న మార్క్స్ తన అధ్యయనానికి మరింత సమయం కేటాయించడంతో చెప్పుకోదగిన స్థాయిలో సైద్ధాంతిక పురోగమనం సాధించి తాత్కాలిక ఉపశమనం పొందగలిగాడు. 1861 అక్టోబరులో ఎంగెల్స్‌కు రాసిన లేఖలో ఈ విధంగా తెలియజేశాడు. నిలదొక్కుకోడానికి వీలుగా పరిస్థితులు మారుతున్నాయి. న్యూయార్క్ ట్రిబ్యూన్‌కు తాను చేస్తున్న పనికి వారానికి రెండు పౌండ్లు లభిస్తున్నాయని, అదేవిధంగా డీ పెర్సీ పత్రికతో కూడా ఒప్పందం కుదుర్చుకున్నానని ఆయన వెల్లడించారు. గత సంవత్సర కాలంగా ఇంట్లో ఉన్న ప్రతి వస్తువును తాకట్టుపెట్టానని, వాటిని వెనక్కి తీసుకునే అవకాశం లేదని, అందువల్ల తన భార్య తీవ్రమైన మనస్థాపానికి గురవుతున్నదని ఆయన వివరించాడు. ఈ రెండు పనుల కారణంగా తన కుటుంబం దుర్భర పరిస్థితి నుంచి బయటపడి తన పుస్తకం పూర్తి చేయడానికి అవకాశం కలిసివస్తుందని ఆయన వెల్లడించాడు.

ఏది ఏమైనప్పటికీ, అదే సంవత్సరం డిసెంబర్‌లో ఎంగెల్స్‌కు రాసిన లేఖలో రుణ భారం 100 పౌండ్లకు మించిపోయిందని, గత్యంతరంలేని పరిస్థితుల్లో మాంసం దుకాణంలో, పచారీ దుకాణంలో ఖాతా మూసివేయవలసి వచ్చిందని ఆయన వెల్లడించాడు. ఇబ్బందుల కారణంగా పరిశోధన నెమ్మదిగా సాగుతున్నదని ఆయన చెప్పాడు. పరిస్థితులు

ఈ విధంగా ఉన్నందువల్ల సైద్ధాంతిక సమస్యలను త్వరితంగా ముగించే అవకాశం కనబడడం లేదని ఆయన వివరించాడు. అయితే ప్రస్తుత పుస్తకం మొదటి భాగం కంటే అందరికీ అందుబాటులో ఉంటుందని, పద్ధతి కూడా సులువుగా ఉంటుందని ఆయన తెలిపాడు.

ఈ పరిస్థితులలో తన తల్లి నుంచి, ఇతర బంధువుల నుంచి, కవి కారల్ సిబెల్ (1836–1868) నుంచి అప్పు తీసుకోవడానికి ప్రయత్నం చేశాడు. తనను నిరంతరం తీవ్రంగా వేధిస్తున్న సమస్యల నుంచి బయటపడేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నానని డిసెంబర్ చివరలో ఎంగెల్స్‌కు రాసిన లేఖలో వివరించాడు. అయితే ఈ ప్రయత్నాలేవీ ఫలించలేదు. అంతేకాకుండా డీ పెర్సీ పత్రికకు పంపిన వ్యాసాలలో సగం మాత్రమే ప్రచురిస్తున్నందువల్ల పెద్ద ప్రయోజనం ఏమీ లభించలేదు. స్నేహితునికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, ఇది కూడా ఇంతకుముందు మాదిరిగానే తయారైతే దానిని దయ్యానికి అంకితం ఇవ్వడం మినహా చేయగలిగిందేమీ లేదని చెప్పుకోవాల్సి వచ్చింది.

అమెరికా అంతర్యుద్ధం కారణంగా ఆర్థిక సమస్యలు తలెత్తడంతో న్యూయార్క్ ట్రిబ్యూన్ పత్రిక విదేశీ కరస్పాండెంట్‌లను తగ్గించి వేసింది. ఆయన 1862 మార్చి పదో తేదీన ఆ పత్రికకు చివరి వ్యాసం రాశాడు. 1851 వేసవి నుంచి నిలకడగా వస్తున్న ఆ కొద్దిపాటి ఆదాయం కూడా వట్టిపోయింది. దీనితో ఆయన పరిస్థితి మరింత గడ్డుగా తయారయ్యింది. 'ఈ నెలలో అద్దె బకాయిలు చెల్లించకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఇంటి యజమాని హెచ్చరించాడు. అన్ని చికాకులు ఒక్కసారిగా చుట్టుముడుతున్నాయ'ని ఆయన ఎంగెల్స్‌కు తెలిపాడు. ఇటువంటి ఇబ్బందుల కారణంగా తన పుస్తక రచన సాగడం లేదని, ఒక్కొక్కసారి వారాల తరబడి నిలిచిపోతుందని ఆయన వెల్లడించాడు.

ఇదే కాలంలో ఆయన అదనపు విలువ సిద్ధాంతాల నూతన పరిశోధన ప్రారంభించాడు. 'క్యాపిటల్ ఇన్ జనరల్' అనే పేరుతో ప్రారంభించిన సుదీర్ఘమైన చాప్టర్‌లో ఈ పరిశోధన ఐదో భాగంగా, చివరి భాగంగా ఉండాలని మార్క్స్ అనుకున్నాడు. దీని కోసం రాసిన 10 నోట్ బుక్స్‌లో ముఖ్యమైన అర్థ శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన అదనపు విలువ సిద్ధాంతాలను క్షుణ్ణంగా పరిశీలించాడు. వీరంతా కూడా అదనపు విలువను యథాతథంగా కాకుండా అంటే శుద్ధమైన అదనపు విలువగా కాకుండా లాభం, అద్దె వంటి రూపాలలో చూసి, పొరపాటు చేశారని ఆయన తెలిపాడు.

మార్క్స్ ఆరో నోట్ బుక్‌ను ఫిజియోక్రాట్స్‌పై విమర్శనాత్మక పరిశీలనతో ప్రారంభించాడు. వారు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన విశ్లేషణకు పునాదులు వేశారని,

అందువల్ల వారు ఆధునిక రాజకీయ అర్థశాస్త్రానికి నిజమైన పితామహులని మార్క్స్ వ్యాఖ్యానించాడు. మర్కంటైలిస్టులు అదనపు విలువ చలామణిలో అంటే ద్రవ్య ఉత్పాదకతలో జనిస్తుందని భావించారని, కానీ అది ఉత్పత్తి క్రమంలోనే జనిస్తుందని ఫిజియోక్రాట్స్ స్పష్టం చేశారని ఆయన వివరించాడు. ఉత్పత్తి క్రమంలో శ్రమ మాత్రమే అదనపు విలువను సృజించగలుగుతుందనే మౌలిక సూత్రాన్ని వారు కనుగొన్నారని ఆయన తెలిపాడు. మరోవైపున వ్యవసాయక శ్రమ మాత్రమే ఉత్పత్తికి దోహదం చేస్తుందని వారు పొరపాటుగా అర్థం చేసుకున్నారని, అంతేకాకుండా భూమికి లభించే అద్దె మాత్రమే అదనపు విలువ అవుతుందని వారు భావించినట్టు మార్క్స్ స్పష్టం చేశాడు. భూమి ఉత్పాదకతతో మానవుడు తన జీవనానికి అవసరమైన మేరకు మాత్రమే ఉత్పత్తి చేసుకోగలుగుతాడనీ, వారు తమ విశ్లేషణను పరిమితం చేసుకున్నారని, ఈ సిద్ధాంతం ప్రకారం అదనపు విలువ అనేది ప్రకృతి వరం అవుతుందని ఆయన వివరించాడు.

మార్క్స్ ఆరో నోట్ బుక్ రెండో అర్ధభాగంలో 7, 8, 9 నోట్ బుక్‌లలో ఎక్కువ భాగం ఆడం స్మిత్ గురించి రాశాడు. వ్యవసాయక శ్రమ మాత్రమే అదనపు విలువకు దోహదం చేస్తుందని ఫిజియోక్రాట్ల పొరపాటు అభిప్రాయాన్ని ఆడం స్మిత్ తిరస్కరించాడు. బూర్జువా సమాజం అనుసరించే ప్రత్యేక శ్రమ విధానంలో, 'శ్రమజీవి, శ్రమలో కొంత భాగానికి ఎటువంటి చెల్లింపులు చేయకుండానే పెట్టుబడిదారుడు స్వాహా చేస్తాడు. మరో విధంగా చెప్పాలంటే, శ్రామికుని పక్షం నుంచి చూస్తే, తక్కువ శ్రమకు, ఎక్కువ శ్రమను మార్పిడి చేసుకుంటున్నాడు. అదే పెట్టుబడిదారుని పక్షం నుంచి చూస్తే, ఎక్కువ శ్రమను, తక్కువ శ్రమతో మార్పిడి చేసుకుంటున్నాడు' అని ఆడం స్మిత్ పెట్టుబడిదారీ విధానం విశిష్ట లక్షణాలను చెప్పగలిగాడని మార్క్స్ ప్రశంసించాడు. అయితే అదనపు విలువ – లాభం, అద్దె రూపం తీసుకున్నప్పుడు అది శుద్ధమైన అదనపు విలువ నుంచి ఎలా భిన్నంగా ఉంటుందనేది అర్థం చేసుకోవడంలో స్మిత్ విఫలమయ్యాడని, పెట్టుబడిలో భాగంగా జనించే అదనపు విలువను, ఆ భాగం ఎంత అనేది లెక్కలు కట్టకుండా, పెరిగిన పెట్టుబడి మొత్తం విలువపై అదనంగా ఉన్న దానిని అదనపు విలువగా లెక్క కట్టాడని, పెరిగిన పెట్టుబడిలో పెట్టుబడిదారుడు ముడి సరుకుల కొనుగోలుకు వెచ్చించే మొత్తాన్ని కూడా చేర్చాడని మార్క్స్ వివరించాడు.

1862 ఏప్రిల్‌లో మూడు వారాల పాటు మాంచెస్టర్‌లో నివసిస్తున్న ఎంగెల్స్ దగ్గరికి వెళ్ళినప్పుడు, మార్క్స్ ఈ ఆలోచనలకు లిఖిత రూపం ఇచ్చాడు. మాంచెస్టర్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత లాసెల్లేకు ఆయన ఈ విధంగా తెలియజేశాడు :

రానున్న రెండు నెలల్లో నా పుస్తకం పూర్తి కాదు. గత సంవత్సరంలో ఆకలి నుంచి కాపాడుకోవడానికి నేను హీనమైన అనేక పనులు చేయాల్సి వచ్చింది. అందువల్ల ఆ పుస్తకంలో ఒక్క లైను కూడా రాయలేని పరిస్థితి నెలల తరబడి కొనసాగింది. అంతేకాకుండా, నాలో ఉన్న సంశయజీవితో కూడా సమస్య ఎదురవుతున్నది. నేనేదైనా రాసి నెల రోజుల తర్వాత చూస్తే అందులో అన్నీ లోపాలే కనిపించి, మళ్లీ దానిని తిరగ రాయవలసిన పరిస్థితి ఎదురవుతున్నది.

మార్క్స్ మొండిగా మళ్ళీ పని ప్రారంభించాడు. జూన్ ఆరంభం నాటికి ఆయన పరిశోధన జర్మెయిన్ గార్నియర్ (1754–1821), చార్లెస్ గానిల్ (1758–1836) వంటి అర్థశాస్త్రవేత్తలకు విస్తరింపచేశాడు. ఆ తరువాత ఉత్పాదక శ్రమ, అనుత్పాదక శ్రమలపై మరింత లోతుగా అధ్యయనం కొనసాగించాడు. అంతేకాకుండా స్పష్టత లేకపోయినప్పటికీ పెట్టుబడిదారునివైపు ఆలోచించడం, కార్మికుని పక్షంగా ఆలోచించడం అంటూ వాటి మధ్య భిన్నత్వాన్ని అర్థం చేసుకున్న ఆడం స్మిత్‌పై మళ్లీ అధ్యయనం కొనసాగించాడు.

ఉత్పాదక శ్రమను పెట్టుబడిలో భాగమైన వేతనంతో మార్పిడి చేసుకున్నందువలన ఆ భాగం మేరకు పెట్టుబడిని పునరుత్పత్తి చేయటమే కాకుండా (లేదా ఆ శ్రమకు వున్న విలువను మాత్రమే కాకుండా) పెట్టుబడిదారునికి అదనపు విలువను కూడా సృష్టిస్తుంది. అప్పుడు మాత్రమే ఉపయోగపు వస్తువు లేదా ద్రవ్యం పెట్టుబడిగా మార్పు చెంది, పెట్టుబడి ఉత్పత్తి అవుతుంది. పెట్టుబడిని ఉత్పత్తి చేసే వేతన శ్రమ మాత్రమే ఉత్పాదక శ్రమగా ఉంటుంది.

మరోవైపున, అనుత్పాదక శ్రమ అంటే పెట్టుబడితో మార్పిడి కాని శ్రమ. కానీ అది ప్రత్యక్షంగా ఆదాయంతో అంటే వేతనాలు లేదా లాభంతో ముడిపడి ఉంటుంది. ఆడం స్మిత్ ప్రకారం చక్రవర్తులు వారి చుట్టూ ఉన్న న్యాయ, సైనికాధికారుల కార్యకలాపాలు విలువను సృష్టించలేవు. వారి కార్యకలాపాలు ఒక రకంగా చెప్పాలంటే ఇంటిపని చేసేవారి విధులతో సమానమైనవి. ఆడం స్మిత్ భాష 'ఇంకా విప్లవ పాత్రను పోషిస్తున్న బూర్జువా వర్గ' లక్షణాలను తెలుపుతున్నదని మార్క్స్ తెలిపాడు. అప్పటికి ఈ బూర్జువా వర్గం సమాజం అంతటిని, రాజ్యాంగ యంత్రం తదితరాలను తన అధీనంలోకి తెచ్చుకోలేదు.

చక్రవర్తి, న్యాయమూర్తి, అధికారి, మత గురువు వంటి ప్రతిష్టాత్మక పదవులలో ఉన్నవారు – వారికి సంబంధించిన విజ్ఞులు, వారి గురువులు, వారి మత గురువులు తదితరమైన పాత భావజాలం నుంచి వస్తున్న వారసత్వ వర్గాలవారిని ఆర్థికపరంగా

చూసినప్పుడు, బూర్జువాలు నియమించుకునే కోకొల్లలుగా ఉండే బంట్లు, విదూషకుల స్థాయికే జమకట్టారు. బూర్జువాలతోపాటు వ్యర్థంగా ఉన్న సంపద – భూస్వాములు, ప్రభువులు, సోమరులైన పెట్టుబడిదారులు ఈ పరిస్థితికి దోహదం చేస్తున్నారు.

పదో నోట్ బుక్‌లో ఫ్రాంకోయిస్ క్వేస్నే (1694–1774) రాసిన టాబ్లూ ఎకనమిక్ పుస్తకంపై మార్క్స్ కఠినమైన విశ్లేషణ చేశాడు. ఆ పుస్తకాన్ని మార్క్స్ ఆకాశానికి ఎత్తేశాడు. రాజకీయ అర్థశాస్త్రం చెబుతున్న అంశాలకు సంబంధించి ఈ పుస్తకం ఉన్నత స్థానం ఆక్రమిస్తుందని మార్క్స్ చాలా స్పష్టంగా చెప్పాడు.

ఇదిలా ఉండగా మార్క్స్ ఆర్థిక పరిస్థితులు మరింత దిగజారిపోయాయి. జూన్‌లో ఎంగెల్స్‌కు రాసిన లేఖలో 'తను, తన పిల్లలు స్మశానంలో మాత్రమే భద్రంగా ఉండగలమని కోరుకుంటున్నట్టు' నా భార్య ప్రతిరోజు చెబుతున్నది. నిజానికి ఆమెను నిందించవలసిన పనిలేదు. ఈ పరిస్థితులలో నిత్యం ఎదురవుతున్న అవమానాలు, బాధలు, బెదిరింపులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇంతకు ముందు విడిపించుకున్న తాకట్టు పెట్టిన వస్తువు లన్నింటిని మళ్లీ ఏప్రిల్‌లో తాకట్టు పెట్టారు. పరిస్థితి ఎంత తీవ్రంగా తయారయ్యిందంటే జెన్నీ తన భర్త పుస్తకాలు కొన్నిటిని అమ్మేయాలని ప్రయత్నం చేసింది. కానీ వాటిని కొనే నాథుడు లేడు.

ఏది ఏమైనప్పటికీ, మార్క్స్ తన పరిశోధన కొనసాగించగలిగాడు. జూన్ మధ్యలో ఎంగెల్స్‌కి రాసిన లేఖలో తన కృషిపట్ల సంతృప్తి వ్యక్తం చేశాడు. 'ఇది వింతగా కనిపించవచ్చు గాని, పేదరికం ఎంతగా ఇబ్బంది పెడుతున్నప్పటికీ ఇంతకు ముందు కంటే నా మెదడు చాలా చురుకుగా పనిచేస్తున్నది.' వేసవి నాటికి కొనసాగించిన పరిశోధనలతో 11, 12, 13 నోట్ బుక్స్ నింపగలిగాడు. వీటిలో అద్దెకు సంబంధించిన సిద్ధాంతాలు ఉన్నాయి. వీటిని అచ్చువేయడానికి తయారుచేస్తున్న పుస్తకంలో అదనపు చాప్టర్‌గా ఏర్పాటు చేయాలని భావించాడు. వీటిలో జోహాన్ రాడ్ బెర్టస్ (1805–1875) ఆలోచనలను విమర్శనాత్మకంగా పరిశీలించారు. ఆ తరువాత డేవిడ్ రికార్డో (1772–1823) సిద్ధాంతాలపై సవివరమైన విశ్లేషణ చేశాడు. శుద్ధమైన అద్దె అంటూ ఏదీ ఉండదని తిరస్కరిస్తూ, భూమి అందుబాటులో ఉన్న ప్రాంతాన్నిబట్టి, భూసారాన్ని బట్టి అద్దె మారుతూ ఉంటుందని రికార్డో భావించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం అద్దె అదనంగా లభిస్తున్నట్లు లెక్క. ఈ లెక్క సరికాదు అనడానికి ఆస్కారమే లేదు. ఎందువల్లనంటే విలువ అనేది శ్రమ కాలానికి సరిసమానంగా ఉంటుందన్న రికార్డో మౌలిక సిద్ధాంతానికి విరుద్ధం అవుతుంది. అప్పుడు వ్యవసాయోత్పత్తులను ఉత్పత్తి ధర

కన్నా ఎక్కువగా అమ్ముతున్నట్టు అంగీకరించవలసి వస్తుంది. ఇది పెరిగిన పెట్టుబడులకు, సగటు లాభాలకు సమానంగా ఉంటుందని అంగీకరించవలసి వస్తుంది. దీనికి విరుద్ధంగా, శుద్ధమైన అద్దె అనే భావన, కచ్చితమైన చారిత్రక పరిస్థితులలో నిజానికి భూసంబంధమైన ఆస్తుల నుంచే ముడి పదార్థాల ధరలు పెరుగుతాయని మార్క్స్ తెలిపాడు.

సిద్ధాంత రచనలో తాను ఈ విధంగా పురోగతి సాధించడం నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుందని మార్క్స్ అదే లేఖలో ఎంగెల్స్‌కు వివరించాడు. తాను పోలీసులను పంపక తప్పదని ఇంటి యజమాని మళ్లీ హెచ్చరించాడు. సరకుల దుకాణంలో అప్పు పెరిగిపోయి నందువల్ల తాము ఇచ్చేది లేదని వారు తేల్చి చెప్పారు. మార్క్స్ మరోసారి ఎంగెల్స్ సహాయం కోరక తప్పలేదు. తన భార్యా పిల్లల కోసం అదే ఇంటిలో వుండవలసి వస్తున్నదని, లేనిపక్షంలో తన సంపాదనలో ఎక్కువ భాగం హరిస్తున్న అద్దె నుంచి తప్పించుకోవడానికి ఏదో ఒక చౌకబారు నివాసానికి మారి ఉండేవాడినని మార్క్స్ తన గోడు వెళ్లబోసు కున్నాడు. కొత్త సంవత్సరంలో తనకు రైల్వేలో ఉద్యోగం దొరికే అవకాశం ఉందని సెప్టెంబర్‌లో ఎంగెల్స్‌కు మార్క్స్ తెలియజేశాడు. డిసెంబర్‌లో లుడ్విగ్ కుగుల్‌మాన్ (1828–1902)కు రాసిన లేఖలో కూడా తన పరిస్థితి మరింత నిరాశాజనకంగా తయారయిందని, తాను ఏదో ఒకటి చేయక తప్పదని వెల్లడించాడు. కానీ ఈ ఆలోచన నుంచి ప్రయోజనం ఏదీ కలుగలేదు. 'అదృష్టవశాత్తు, లేదా నిజం చెప్పాలంటే దురదృష్టవశాత్తు చేతివ్రాత బాగా లేనందున రైల్వే ఉద్యోగం తిరస్కరించారంటూ' తన సహజ వ్యంగ్య ధోరణిలో మార్క్స్ వెల్లడించాడు. ఇదిలా ఉండగా, నవంబర్ ప్రారంభంలో ఫెర్డినాండ్ లాసెల్లేకు (1825–1864) లేఖ రాస్తూ, 'తన పని 6 వారాలపాటు నిలిపివేయ వలసివచ్చిందని', కానీ 'కొద్దిపాటి ఆటంకాలతో ముందుకు సాగుతూనే ఉందని' ఆయన వివరించాడు. ఏది ఏమైనప్పటికీ, 'అది త్వరలోనే ముగింపుకు వస్తుందని' ఆయన హామీ ఇచ్చాడు.

ఈ మధ్యకాలంలో వివిధ ఆర్థిక శాస్త్రవేత్తలపై విస్తృత విమర్శనాత్మక విశ్లేషణలతో 15, 16 నోట్ బుక్స్‌ను ఆయన నింపాడు. థామస్ రాబర్ట్ మాల్థూస్ (1766–1834) 'సరకులను వాటి విలువకు మించి అమ్ముతున్నందువల్ల అదనపు విలువ వస్తున్నట్టు భావించాడని' ఫలితంగా ఆయన సరకుల మార్పిడిలోనే లాభం వస్తున్నట్టు నిర్ధారించాడని, ఇది అంతకు పూర్వపు ఆర్థిక సిద్ధాంతాలను తిరగదోడడమేనని మార్క్స్ స్పష్టం చేశాడు. జేమ్స్ మిల్ (1773–1836) అదనపు విలువ, లాభం అనే భావనలను పొరపాటుగా అర్థం చేసుకున్నాడని మార్క్స్ ఆరోపించాడు. శామ్యూల్ బెయిలీ (1791–1870)

వసుదా ఉండే విలువకు, సరకు విలువకు మధ్య తేడా చూడడంలో విఫలమై గందరగోళానికి కారణమయ్యాడని మార్క్స్ వివరించాడు. జాన్ స్టువర్ట్ మిల్ (1806–1873) 'అదనపు విలువ రేటు, లాభం రేటు రెండు భిన్నమైన ప్రమాణాలని' గ్రహించలేకపోయాడని మార్క్స్ వాదించాడు. లాభం అనేది వేతనాల స్థాయినిబట్టే కాకుండా, వేతనాలకు ప్రత్యక్షంగా సంబంధంలేని ఇతర కారణాలపై కూడా ఆధారపడి ఉంటుందని ఆయన తెలిపాడు.

ఆ తరువాత రికార్డో సిద్ధాంతాలను వ్యతిరేకిస్తున్న ఆర్థిక శాస్త్రవేత్తలపై మార్క్స్ దృష్టి కేంద్రీకరించాడు. సోషలిస్టు థామస్ హాడ్జ్ స్కిన్ (1787– 1869) సిద్ధాంతాలను ఆయన పరిశీలించాడు. చివరగా రచయిత పేరు తెలియని 'రెవెన్యూ అండ్ ఇట్స్ సోర్సెస్' అనే పుస్తకాన్ని విశ్లేషించాడు. ఇది భ్రష్టుపట్టిన అర్థశాస్త్రానికి మచ్చుతునక. ఇది యథాతథ పరిస్థితులను సమర్థిస్తూ, పాలకవర్గాలకు అంటే పెట్టుబడిదారులకు మద్దతు ఇస్తున్నదని ఆయన తీవ్రంగా విమర్శించాడు. దీనితో ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తలు గతంలో ప్రతిపాదించిన అదనపు విలువ సిద్ధాంతాల విమర్శను ముగించి, వాణిజ్య పెట్టుబడి లేదా అదనపు విలువను సృజించకుండా, కేవలం దాని పంపిణీకి పరిమితమైన పెట్టుబడిని పరిశీలించే కార్యక్రమం ప్రారంభించాడు. వడ్డీ సమకూర్చే పెట్టుబడికన్నా, పంపిణీకి పరిమితమైన పెట్టుబడి సోషలిజం సాధనకు దోహదం చేస్తుందన్న వివాదం జోలికి మార్క్స్ పోలేదు. ఇటువంటి సంస్కరణలకు సంబంధించిన వివాదాలతో మార్క్స్ తన సమయం వృధా చేసుకోదలచుకోలేదు. ఇవి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని మొత్తంగా కాకుండా దానివల్ల వచ్చే ఒక ఫలితాన్ని పట్టుకొని వేలాడుతున్నాయని ఆయన విమర్శించాడు. దీనికి భిన్నంగా మార్క్స్ చెప్పిందేమంటే :

పెట్టుబడిని వడ్డీ సంపాదనకు మార్గమని భావించినప్పుడు పెట్టుబడి చారిత్రక స్వభావం కోల్పోయి, పూర్తిస్థాయి వస్తు తత్వాన్ని పొంది, తలక్రిందులై, గతి తప్పుతుంది. కానీ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన అంతర్గత స్వభావాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు దాని గతి తప్పిన స్వభావాన్ని చూసినప్పుడు మనకు చాలా స్పష్టంగా కనిపించేదేమంటే, పెట్టుబడితో 'చక్రవడ్డీ లభిస్తుంది'. ఇది ఎలా కనిపిస్తుందంటే, మీకు పౌరాణిక గాథలలో ముల్‌లోచ్ ప్రపంచానికి హక్కుగా లభించిన సర్వస్వాన్ని తనకు బలిపెట్టాలని కోరినట్టుగా ఉంటుంది. అయితే స్వభావరీత్యా పెట్టుబడి కోరుకున్నవన్నీ ఏనాటికీ నెరవేరవు. అయితే తెలియని తీవ్రశక్తులు ఈ కోరికలకు అడ్డుపడుతుంటాయి.

ఇదే ధోరణిలో మార్క్స్ ఇంకా ఏమి చెప్పాడంటే :

ఆ విధంగా పెట్టుబడి నుంచి వస్తున్న విలువ లాభంలో భాగంగా కాకుండా, వడ్డీ నుంచి వస్తున్నట్టుగా కనిపిస్తుంది. (...అంతే కాకుండా) దానిని పెట్టుబడి సృజించే ప్రత్యేకమైన ఆదాయంగా పరిగణిస్తున్నారు. భ్రష్టుపట్టిన ఆర్థిక శాస్త్రవేత్తలు దీనిని ఇదే విధంగా పరిగణిస్తున్నారు. (...) వీరు మధ్యంతర సంబంధాలన్నిటినీ విస్మరిస్తారు. ఇదే కాకుండా పెట్టుబడి దివ్యమైనది **(fetish)**గా రూపొందడం, తరువాత పెట్టుబడి పూర్తిగా దివ్యరూపం పొందినట్టు కూడా మరచిపోతారు. సొంత ఆస్తి పరిధి నుంచి ఆర్థిక అంశాన్ని విడదీసి నందువల్ల తప్పనిసరిగా ఈ రూపమే మనకు గోచరిస్తుంది. వడ్డీ పేరుతో లాభాల్లో కొంత భాగం పెట్టుబడికి దక్కుతుందని, దానిని ఉత్పత్తి క్రమం నుంచి పూర్తిగా విడదీసి నందువల్ల లేదా అది పెట్టుబడి సొంతదారునికి దక్కుతుందని చెప్పడంతో భ్రష్టుపట్టిన ఆర్థికవేత్త పెట్టుబడి తనంత తానుగా విలువను సృష్టిస్తుందని చెప్పాలని కోరుకుంటున్నాడు. ఈ విధంగా పెట్టుబడి విలువను సృష్టించే వనరుగా రూపొందిస్తాడు. అంటే అది దేవుని మహిమగా రూపొందుతుంది. ఈ విధంగా లభించే లాభం పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో భాగంగా గుర్తించడానికి అవకాశం లేకుండాపోతుంది. అది ఉత్పత్తి క్రమం నుంచి విడిపోయి సొంత అస్తిత్వాన్ని పొందుతుంది. అప్పుడు కూడా **M-C-M'** అనే మధ్యంతర సంబంధం ఉంటుంది. కానీ **M-M'** అన్నప్పుడు మనకు అర్థంకాని పెట్టుబడి రూపం వస్తుంది. అప్పుడు వ్యవహారాన్ని పూర్తిగా తిరగదోడి ఉత్పత్తి సంబంధాలను తాము కోరుకున్నట్టు చూపించడానికి వీలవుతుంది.

వాణిజ్య పెట్టుబడులపై అధ్యయనం చేసిన తరువాత మార్క్స్ 1861–1863 నాటి మూడో దశ ఆర్థిక రాతప్రతులుగా భావిస్తున్న వాటిని రాయడం ప్రారంభించాడు. ఇది 1862 డిసెంబర్‌లో ప్రారంభమైంది. 'పెట్టుబడి–లాభాలు' అనే విభాగంలో ఆయన 15వ నోట్ బుక్ రాయడం ప్రారంభించాడు. అది మూడో చాప్టర్ అని ఆయన సూచించాడు. ఇందులో అదనపు విలువ, లాభం మధ్య ఆయన స్పష్టమైన విభజన చేశాడు. డిసెంబర్‌లోనే ఆయన 17వ నోట్ బుక్ కూడా రాశాడు. ఇందులో ఆయన వాణిజ్య పెట్టుబడిని విశ్లేషించాడు. (15వ నోట్ బుక్‌లో రాసిన ఈ అంశాన్ని మరింతగా విపులీకరించాడు.) పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ద్రవ్యం (reflux) ఎలా వెనక్కు మళ్లేది ఆయన వివరించాడు. సంవత్సరాంతంలో తాము సాధించిన ప్రగతిని కుగల్‌మాన్‌కు మార్క్స్ వివరించాడు. మొదటి విడతలో రెండో భాగం 30 పేజీల అచ్చుప్రతికి సరిపోయే రాతప్రతి ఎట్టకేలకు సిద్ధమైందని ఆయన తెలిపాడు. కంట్రిబ్యూషన్ టు క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ ప్రచురించిన 4 సంవత్సరాల తర్వాత మార్క్స్

ప్రాజెక్ట్ పని సమీక్షించుకున్నాడు. ప్రస్తుతం తన పుస్తకానికి క్యాపిటల్ అని పేరు పెట్టదలచుకున్నానని తొలిసారి ఆ పేరును వ్యక్తం చేశాడు. 1859లో ప్రచురించిన పుస్తకం పేరు ప్రస్తుతం కేవలం సబ్ టైటిల్‌గా మాత్రమే ఉంటుందని ఆయన కుగుల్‌మాన్‌కు వివరించాడు. ఈ మార్పులేని పక్షంలో మొదటి ప్లాన్ ప్రకారం మూడో చాప్టర్‌లోని, మొదటి భాగంలో 'క్యాపిటల్ ఇన్ జనరల్' అనే పేరుతో చేర్చి ఉండేవారు. అప్పుడు ప్రచురించదలచుకున్న పుస్తకంలో ఇది ఇంగ్లీషువారు చెప్పే విధంగా "ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" అనే శీర్షికతో ఉండేది. ఆయన 1859లో ప్రచురించిన పుస్తకంలోని అంశాలతోపాటు మొత్తంగా ఇది ఆయన ఆర్థిక సిద్ధాంత మౌలిక సారాంశంగా (quintessence) రూపొంది ఉండేది. నేను ప్రత్యేకతలతో అనుకున్న అంశాల తరువాత క్రమాన్ని ఇతరులు కూడా తేలికగానే అనుసరించగలిగేవారని కుగుల్‌మాన్‌కు మార్క్స్ వివరించాడు. (అయితే, వివిధ రాజ్యాల మధ్య సంబంధాలు, సామాజిక ఆర్థిక నిర్మాణంలో వాటి పాత్రను అనుసరించడం ఇతరులకు సాధ్యమయ్యేది కాదు.)

కొత్త సంవత్సరంలో ముసాయిదాను సరిదిద్దిన ప్రతి సిద్ధమవుతుందని మార్క్స్ అనుకున్నాడు. ఆ తరువాత ఆ ప్రతిని తనే స్వయంగా జర్మనీకి తీసుకువెళ్లాలని అనుకున్నాడు. దీనిలో పెట్టుబడి, పోటీ, రుణం కూడా చేర్చనున్నట్టు అదే లేఖలో ఆయన తెలియజేశారు. 1859లో ప్రచురించిన పుస్తకంలో శైలికి, ప్రస్తుతం రూపొందిస్తున్న పుస్తకంలో శైలికి మధ్య తేడాలను ఆయన వివరించారు. 'అప్పటి పుస్తకంలో అమూర్త భావాలు ఎక్కువగా ఉన్నందువల్ల అది సాధారణ ప్రజానీకానికి అర్థం కావడం కష్టమని ఆయన తెలిపారు. (...) మూర్తమైన లేదా భౌతిక వాస్తవాలను వివరిస్తున్న ప్రస్తుత పుస్తకం అర్థం చేసుకోటానికి తేలికగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.' ఈ తేడాలను దాదాపుగా సమర్థిస్తూ ఇంకా ఈ మాటలు చెప్పారు.

విజ్ఞానశాస్త్రాన్ని విప్లవాత్మకంగా రూపొందించడానికి జరిగే శాస్త్రీయ ప్రయత్నాలు విస్తృత ప్రజానీకానికి అర్థం కావడం కష్టం. కాని ఒక్కసారి శాస్త్రీయ పునాదులు ఏర్పడిన తరువాత వాటిని అందరికీ అర్థమయ్యేటట్లు చెప్పడం తేలిక. అయితే ఒత్తిడి పెరిగినప్పుడు ఈ పునాదులను ప్రజానీకానికి వివరించడానికి అవసరమైన రంగులు, విధానాలను ఎంపిక చేయడానికి వీలవుతుంది.

కొద్ది రోజుల తరువాత నూతన సంవత్సరం ప్రారంభంలో తన పుస్తకంలో రాయ దలచుకున్న వివిధ భాగాల సవివరమైన జాబితాను మార్క్స్ రూపొందించాడు. 18వ

నోట్ బుక్‌లో రాసుకున్న వివరాలను అనుసరించి 'మొదటి భాగం (Abschnitt)', 'పెట్టుబడి ఉత్పత్తి క్రమాన్ని' ఈ క్రింది విధంగా విభజించాడు :

1) ఇంట్రడక్షన్, కమోడిటీ, మనీ 2) ద్రవ్యం, పెట్టుబడిగా మారడం 3) అఖండ అదనపు విలువ (...) 4) సాపేక్ష అదనపు విలువ (...) 5) అఖండ-సాపేక్ష అదనపు విలువల కూడిక, (...) 6) అదనపు విలువ మళ్ళీ పెట్టుబడిగా మారడం, ఆదిమ పెట్టుబడి సంచయము, వేక్ ఫీల్డ్ వలస సిద్ధాంతం. 7) ఉత్పత్తి క్రమంలో ఫలితాలు. (...) 8) అదనపు విలువ సిద్ధాంతాలు. 9) ఉత్పాదక, అనుత్పాదక శ్రమ సిద్ధాంతాలు.

మార్క్స్ మొదటి వాల్యూమ్‌కు మాత్రమే పరిమితం కాకుండా 'క్యాపిటల్ అండ్ ప్రాఫిట్' అనే పేరుతో ఆయన తలపెట్టిన మూడో విభాగానికి కూడా ముసాయిదా సిద్ధం చేశాడు. అప్పటికే సిద్ధం చేసుకున్న వాల్యూమ్ మూడులో భాగంగా సైద్ధాంతిక వివరాలు రూపొందించిన ఈ భాగంలో ఈ విధమైన విభజన చేశారు :

1) అదనపు విలువ లాభంగా మారడం. లాభం ప్రమాణం అనేది రూపాంతరం చెందిన అదనపు విలువ ప్రమాణం. 2) లాభం అనేది సగటు లాభంగా మారడం. (...) 3) లాభం ఉత్పత్తి ధరలకు సంబంధించి ఆడం స్మిత్, రికార్డోల సిద్ధాంతాలు. 4) అద్దె (...) 5) రికార్డో అద్దె సూత్రాలుగా పిలుస్తున్న అద్దె సూత్రాల చరిత్ర. 6) పడిపోయే లాభాల నిష్పత్తి సూత్రం. 7) లాభాల సిద్ధాంతాలు. 8) లాభంలో పారిశ్రామిక లాభం, వడ్డీ విభజన. 9) ఆదాయం, దానికి సంబంధించిన వనరులు. 10) పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం మొత్తంమీద ద్రవ్యం కదలికలు. 11) రాష్ట్ర ఆర్థిక విధానం. 12) ముగింపు. పెట్టుబడి, వేతన కార్మికులు.

1863లో రాసుకున్న పద్దెనిమిదవ నోట్ బుక్‌లో వాణిజ్య పెట్టుబడి (mercantile capital) విశ్లేషణను మార్క్స్ కొనసాగించాడు. ఈ సందర్భంగా జార్జ్ రామ్సే (1855-1935), ఆంటోని-ఎలిసి చెఎ బుల్జ్ (1797-1869), రిచర్డ్ జోన్స్ (1790-1855) తదితర ఆర్థికవేత్తల పుస్తకాలను అధ్యయనం చేసి, అదనపు విలువను వివిధ ఆర్థికవేత్తలు అర్థం చేసుకున్న తీరుపై నోట్స్ రాసుకున్నారు.

ఈ కాలంలో కూడా మార్క్స్ ఆర్థిక ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి. నిజం చెప్పాలంటే అవి 1863 ప్రారంభంలో మరింత దుర్భరంగా తయారయ్యాయి. 'ఫ్రాన్స్, జర్మనీలలో అప్పులు చేయడానికి ప్రయత్నాలు ఫలించలేదని, ఆహారం అప్పుగా ఇవ్వడానికి ఎవరూ ఒప్పుకోవడం లేదని, బయటకు వెళ్లడానికి పిల్లలకు దుస్తులు, చెప్పులు లేవని' ఎంగెల్స్‌కు రాసిన లేఖలో మార్క్స్ తెలియజేశాడు. రెండు వారాల తరువాత మరింతగా

ఊబిలో కూరుకుపోయాడు. జీవిత సహచరితో కలిసి తప్పనిసరి పరిస్థితులలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని ఎంగెల్స్‌కు రాసిన మరో లేఖలో వెల్లడించాడు.

నా పెద్ద పిల్లలిద్దరూ కన్నింగ్ హామ్ కుటుంబ సహకారంతో గవర్నెస్‌లుగా చేరాలని, లెంచెన్ వేరేచోట పనిలో చేరాలని, నేను, నా భార్య పసివాడైన టస్సీతో కలసి సిటీ మోడల్ లాడ్జింగ్‌కు నివాసం మార్చాలని నిర్ణయించుకున్నాము. రెడ్ ఊల్ఫ్ కుటుంబంతో పాటు కొంత కాలంపాటు ఈ లాడ్జ్‌లోనే నివాసం ఉన్నాడు.

అదే సమయంలో కొత్తగా అనారోగ్య సమస్యలు కూడా తలెత్తాయి. ఫిబ్రవరి మొదటి రెండు వారాలలో మార్క్స్ చదవడం, రాయడం లేదా పొగపీల్చడం మానాలని స్పష్టం చేశారు. ఆయనకు కంటి సమస్య, తలలో నరాలకు సంబంధించిన సమస్య వచ్చాయి. రెండు వారాల తరువాత మాత్రమే మళ్లీ పుస్తకాలు చదవడం ప్రారంభించగలిగాడు. ఖాళీగా ఉన్న ఈ రోజుల్లో 'తాను గుడ్డివాడిని అయిపోతానని, తనకు పిచ్చి ఎక్కుతుందనే ఊహలతో భయపడి పోయానని' ఆయన ఎంగెల్స్‌కు తెలియజేశాడు. కంటి సమస్య తగ్గగానే ఆయనకు కాలేయ సమస్య ప్రారంభమైంది. దీనితో ఆయన చాలా కాలం బాధ పడ్డాడు. ఎప్పుడూ వైద్యం చేసే డాక్టర్ అలెన్ పూర్తిగా చికిత్స తీసుకోవాలని ప్రతిపాదించా రని అందువల్ల నేను పూర్తిగా పని మానుకోవాల్సివస్తున్నదని డాక్టర్ ఎడువర్డ్ గుంపెర్ట్ నుంచి తేలికగా ఉండే గృహవైద్యం ఇప్పించాలని ఆయన ఎంగెల్స్‌ను కోరాడు.

ఈ కాలంలో ఆయన మన యంత్రాల గురించి అధ్యయనం చేశాడు. అయితే ఆర్థిక అంశాల లోతైన అధ్యయనాన్ని మాత్రం వాయిదా వేయవలసి వచ్చింది. అయితే వెనుకబడిన అధ్యయనాన్ని కొనసాగించడానికి మార్చిలో మరింత తీవ్రంగా పని చేశాడు. నోట్ బుక్స్ 20, 21 లను నింపేశాడు. వీటిలో సంచయం, వాస్తవిక, సాధారణ శ్రమ పెట్టుబడిలో విలీనమవుతున్న తీరు, పెట్టుబడి, శ్రమ ఉత్పాదకతను వివరించాడు. ఆ రోజులలో ప్రధానంగా అదనపు విలువపై సాగిస్తున్న పరిశోధనలో తన వాదనలను సరిపోల్చి చూసుకున్నాడు.

తాను బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలో పోలండ్ సమస్యపై అధ్యయనం చేస్తున్నట్లు మే నెల చివరలో ఎంగెల్స్‌కు తెలియజేశాడు : 'ఒకవైపు రష్యా–ప్రష్యా–పోలండ్ ఈ వ్యవహారంలో దౌత్య, చారిత్రకపరమైన అదనపు సమాచారం సేకరించడంతో పాటు, మరోవైపు నేను వివరిస్తున్న రాజకీయ ఆర్థిక శాస్త్ర వివరాలను సాహిత్యం మొత్తం నుంచి సమీకరించినట్లు. ఈ సమాచారాన్ని మే, జూన్ మాసాలలో 'ఎ టు హెచ్' అనే

8 నోట్ బుక్స్‌లలో రాసుకున్నట్టు, 18, 19వ శతాబ్దాలకు సంబంధించి ఆర్థిక సమాచారాన్ని వీటిలో పొందుపరచినట్టు' మార్క్స్ వివరించాడు.

మళ్లీ నేను పని చేయగలుగుతున్నానని, రాజకీయ అర్థశాస్త్ర పుస్తకం అచ్చు వేయడానికి వీలుగా చివరి ప్రతిని తానే స్వయంగా రాయదలచుకున్నానని, (దానికి చివరి మెరుగులు కూడా దిద్దుతానని) ఎంగెల్స్‌కు తెలియజేశాడు. అయితే ఆయన ఇంకా కాలేయ వ్యాధితో బాధపడుతూనే ఉన్నాడు. ఏది ఏమైనప్పటికీ, మందులు వాడుతున్నా గాని జూన్ మధ్యభాగానికి కూడా ఆయన పూర్తిగా కోలుకోలేదు. కానీ ఆయన జూలై మధ్యనుంచి బ్రిటిష్ మ్యూజియంకు వెళ్లడం ప్రారంభించాడు. అప్పుడు తాను అర్థశాస్త్ర అధ్యయనానికి రోజుకు 10 గంటలకు పైగా పని చేస్తున్నానని ఎంగెల్స్‌కు తెలిపాడు. ఈ రోజుల్లో ఆయన అదనపు విలువ మళ్ళీ ఏవిధంగా పెట్టుబడిగా మారుతుందనేది స్పష్టంగా వివరించగలిగాడు. ఈ క్రమంలో ఆయన నోట్ బుక్ 22లో క్విస్నే రాసిన అర్థశాస్త్రం (Tableau economic) పుస్తకాన్ని దాదాపుగా తిరగరాశాడు. 1861లో ప్రారంభించిన కృషిలో భాగమైన 23వ నోట్ బుక్ రాశాడు. ఇందులో ప్రధానంగా నోట్స్, అనుబంధ సమాచారం ఉంది.

రెండు సంవత్సరాల పాటు కఠిన శ్రమ చేసిన తరువాత, రాజకీయ అర్థశాస్త్రంలో ప్రధానమైన సిద్ధాంతవేత్తల గ్రంథాలన్నింటినీ విమర్శనాత్మక అధ్యయనం చేసిన తర్వాత, తన జీవితంలో ప్రధానమైన పనిగా నిర్ణయించుకుని పరిశోధనను కొనసాగించి తీరాలని మార్క్స్ మరోసారి నిర్ణయానికి వచ్చాడు. అప్పటికే ఆయన భావాలు, విశదీకరణ సమస్యలను చాలావరకు పరిష్కరించినప్పటికీ చారిత్రక అంశాలకు ముగింపు పలకడానికి, ఆయన మళ్లీ సైద్ధాంతిక సమస్యలను అధ్యయనం చేయవలసి వచ్చింది.

2

మూడు వాల్యూమ్‌లు రాయటం

మార్క్స్ అవాంతరాలను ఎదుర్కొంటూనే, మరోసారి నడుం బిగించి తన పరిశోధనలలో మూడో దశను ప్రారంభించాడు. తన జీవితకాలంలో సాధించిన అత్యంత ప్రాధాన్యత కలిగిన కృషి (magnum opus) ప్రారంభించాడు. 1865 డిసెంబర్ నాటికి, వాల్యూమ్ 1 లోని వివిధ అంశాలకు సంబంధించి, వివిధ విభాగాలకు విస్తృతమైన ముసాయిదా రూపొందించాడు. అదేవిధంగా వాల్యూమ్ 3కు సంబంధించి కూడా ముసాయిదా రూపొందించాడు. (పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి సంబంధించి పూర్తి వివరాలను ఆయన ఇందులో పొందుపరిచాడు.) వాల్యూమ్ 2 తొలి ముసాయిదా కూడా చెరువు పొందుపరచాడు. (పెట్టుబడి సర్కులేషన్ విధానానికి సంబంధించి తొలి వివరాలను కూడా రాసుకున్నాడు.) 1859లో ప్రచురించిన 'ఎ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' ముందుమాటలో సూచించిన విధంగా ఆరు వాల్యూమ్‌ల ప్లాన్‌కు అనుగుణంగా ఇంతకుముందు వాల్యూమ్ 2, 3లలో చేర్చదలచుకున్న అద్దె, వేతనాలకు సంబంధించిన అనేక వివరాలను కూడా ఆయన రూపొందించాడు. 1863 ఆగస్టు నాటికి తాను ఏ విధంగా ముందుకు పోదలచుకున్నది తదితర వివరాలను ఆయన ఎంగెల్స్‌కు తెలియజేశాడు :

ఒక విధంగా చెప్పాలంటే, నా పని (ప్రెస్‌కు అందజేయవలసిన ముసాయిదా పని) చాలా బాగా సాగుతోంది. చివరకు ఈ వివరణ అందరికీ అర్థమయ్యే విధంగా రూపొందుతోంది. (...) మరోవైపు నేను రోజంతా వస్తున్నప్పటికీ ఇంతకాలం ఓపిక పట్టి, పుండు వల్ల ఏర్పడిన అసహనం మూలంగా కావలసినంత వేగంగా మాత్రం సాగడం లేదు. నంబర్ వన్ కంటే మరింతగా అవగాహన చేసుకోవడానికి వీలుగా అన్ని వ్యవహారాలు కొనసాగుతున్నాయి.

మార్క్స్ శరత్కాలమంతా చాలా వేగంగా రాస్తూ వాల్యూమ్ 1 కోసం పని చేశాడు. కానీ ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. నవంబర్‌లో ఆయనకు కొత్త వ్యాధి వచ్చింది. ఆ తీవ్రమైన వ్యాధితో అనేక సంవత్సరాలపాటు మార్క్స్ బాధపడినట్లు ఆయన భార్య వెల్లడించింది. దీనివల్ల శరీరమంతా వాపులు, వ్రణాలు (carbunncles) వచ్చేవి.

ఒక్కొక్కసారి పెద్ద వ్రణం వచ్చినప్పుడు శస్త్రచికిత్స చేయవలసి వచ్చేది. నాలుగు వారాలపాటు ఆయన ప్రాణాపాయ స్థితిలోనే ఉన్నట్టు జెన్నీ వెల్లడించింది. దీనివల్ల నిరంతరం తీవ్రమైన బాధ పడేవాడు. దీనికితోడు అనేక రకాల మానసిక బాధలు ఆయనను చుట్టుముట్టేవి. కుటుంబ ఆర్థిక పరిస్థితి అగాధం అంచునే కొనసాగేది.

ఈ వ్యాధి నుంచి కొద్దిగా కోలుకున్న తరువాత 'తాను మృత్యువు సమీపానికి వెళ్లి వచ్చినట్టు' డిసెంబర్ ప్రారంభంలో ఎంగెల్స్‌కు మార్క్స్ తెలియజేశాడు. రెండు రోజుల తర్వాత మరో లేఖలో 'శారీరక పరిస్థితి చిన్న కథకు పనికివచ్చే విధంగా ఉందని' వెల్లడించాడు. ముందు నుంచి చూస్తే తానొక సంతృప్తి పొందిన వ్యక్తిగా హాయలు ఒలుకుతూ, సంతృప్తితో కూడి, బలంగా ఉన్నానని, నిజంగా భారీ శరీరంతో మాంసం కొండ మాదిరిగా కపిస్తున్నానని తెలిపాడు. కానీ వెనుక నుంచి చూస్తే తానొక వ్రణం మాత్రమేనని ఆయన వెల్లడించాడు.

ఈ సందర్భంలోనే తన తల్లి మరణించినందువల్ల ఆయన జర్మనీ వెళ్ళవలసి వచ్చింది. ఈ ప్రయాణంలో ఆయనకు వ్యాధి తిరగబెట్టింది. తిరుగు ప్రయాణంలో నెదర్లాండ్స్‌లో తన అంకుల్ లైన్ ఫిలిప్స్ వద్ద 2 మాసాలపాటు ఉండిపోవలసి వచ్చింది. ఆయనకు కుడి కాలుపై ఇంతకుముందెన్నడూ లేనంతగా పెద్ద వ్రణం ఏర్పడింది. గొంతు, వీపుపై అనేక వ్రణాలు వచ్చాయి. వీటి బాధ కారణంగా రాత్రిళ్ళు నిదురపోలేక బాధపడేవాడు. 'తాను ఒకేసారి అన్నివైపుల నుంచి దాడికి గురైన వింత జీవిలాగా (...) ఉన్నానని 1864 జనవరి ప్రారంభంలో ఆయన ఎంగెల్స్‌కు లేఖ రాశాడు.

లండన్ తిరిగివచ్చిన తరువాత కూడా ఈ వ్యాధితో ఆయన తీవ్రమైన బాధకు లోనయ్యాడు. ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. దాదాపు ఐదు మాసాల తరువాత ఆయన ఏప్రిల్ మధ్య భాగంలో తన పని తిరిగి ప్రారంభించాడు. ఈ రోజుల్లో వాల్యూమ్ 1పై దృష్టి కేంద్రీకరించి 'ఉత్పత్తి క్రమంలో తక్షణమే వచ్చే ఫలితాలు'పై ముసాయిదా రూపొందించాడు. ఇంతకుముందు రాసిన దానిలో ఈ భాగాన్ని మాత్రమే యథాతథంగా స్వీకరించాడు.

మే చివరలో ఆయనకు మళ్ళీ వ్రణాల బాధ తీవ్రంగా పెరిగిపోయింది. ఆయన బాధ వర్ణనాతీతంగా ఉండేది. ఎలాగైనా సరే పూర్తిచేయాలనే నిర్ణయంతో డాక్టర్ అలెన్ వైద్యాన్ని తిరస్కరించాడు. డాక్టర్ అలెన్ విశ్రాంతి తీసుకొని, పూర్తిగా చికిత్స చేయించుకోవాలని పట్టుబడుతున్నందువల్ల, తన పని ఆగిపోకూడదని ఈ విధంగా చేశాడు. మాంచెస్టర్ లోని స్నేహితుడికి లేఖ వ్రాస్తూ, 'ఏదో పొరపాటు జరుగుతున్నదని నేను చాలాకాలంగా అనుకుంటూనే ఉన్నాను. నేను పెద్ద ఎత్తున శక్తిని 'కూడగట్టుకొని' క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నందువల్ల బహుశా ఈ బలహీనతకు కారణం కావచ్చు. స్పినోజా భావాన్ని ప్రస్తావించినందుకు మన్నించాలి.'

వేసవి ప్రారంభమైన తరువాత కూడా మార్క్స్‌కు ఎదురయిన ఇబ్బందికరమైన ఈ పరిస్థితులలో మార్పు రాలేదు. జూలై ప్రారంభంలో ఫ్లూ రావడంతో రాతపని కొనసాగించ లేకపోయాడు. రెండు వారాల తరువాత ఆయనకు మర్మావయవంపై పుండు (pustulent legion) లేవడంతో పది రోజులపాటు పూర్తి విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది. జులై చివరి వారంలో, ఆగస్టు మొదటి పది రోజులు కుటుంబంతో సెలవలు గడిపిన తరువాత తన పని చేసుకోవడానికి వీలుచిక్కింది. వాల్యూమ్ 3లో కొన్ని భాగాలను రాయడం ఆయన ప్రారంభించాడు. అందులోని రెండో భాగం 'లాభం, సగటు లాభంగా మార్పు చెందడం', మొదటి భాగం 'అదనపు విలువ లాభంగా మారడం' రాశాడు. (బహుశా 1864 అక్టోబర్ చివరలో, నవంబర్ ప్రారంభంలో వీటిని పూర్తి చేశాడు.) ఈ కాలంలో ఆయన ఓపికగా ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ సమావేశాలలో పాల్గొంటూనే ఉన్నాడు. ఈ అసోసియేషన్ ప్రారంభ సమావేశం సంఘాన్ని, పరిస్థితిని ఆయనే రాశాడు. అదే నెలలో సోలింజెన్‌లో నివసించే మెటలర్జీ కార్మికుడు, లీగ్ ఆఫ్ కమ్యూనిస్ట్స్ సభ్యుడు, కారల్ క్లింగ్స్ (1828–?) కు లేఖ వ్రాస్తూ తనకు ఎదురైన ఇబ్బందులు, తాను నెమ్మదిగా పని చేయటం గురించి వివరణ ఇచ్చాడు.

గత సంవత్సరమంతా నేను అనారోగ్యంతో ఉన్నాను. (వ్రణాలు, ఇతర వ్యాధులతో ఇబ్బందిపడ్డాను.) ఈ ఆటంకాలు లేకపోయినట్లయితే నేను రాస్తున్న పుస్తకం 'క్యాపిటల్' ఇంతకుముందే వెలువడేది. ఏది ఏమైనప్పటికీ మరో రెండు మాసాలలో నేను అది పూర్తిచేయగలుగుతాను. అది బూర్జువాకు సైద్ధాంతికంగా తేరుకోలేని దెబ్బ కొడుతుంది. (...) నేనింకా కార్మికవర్గ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేస్తున్నాను.

ఇంటర్నేషనల్ బాధ్యతలు ముగిసిన తరువాత ఆయన వాల్యూమ్ 3లోని మూడో

భాగాన్ని రాశాడు. అది 'లాభాల రేటు తగ్గిపోయే స్వభావంపై సూత్రం'. ఈ పని చేసిన తరువాత వ్యాధి మరొకసారి తిరగబెట్టింది. ఛాతి కుడివైపున మరో వ్రణం ఏర్పడింది. వారం రోజుల పాటు ఆయన మంచం మీదనే ఉండవలసి వచ్చింది. ఛాతిపై ఏర్పడిన వ్రణం, 'రాయడానికి ముందుకు వంగినప్పుడు తీవ్రమైన బాధపెట్టేది.' ఆ తరువాతి నెలలలో ఛాతిపై మరో వ్రణం వచ్చే అవకాశం కనిపించడంతో తనకు తానే వైద్యం చేసుకోవాలని మార్క్స్ నిర్ణయించుకున్నాడు. దీర్ఘకాలం ఆర్సెనిక్ మందులతో వైద్యం చేసినందు వల్ల వచ్చే దుష్పరిణామాల గురించి డాక్టర్ అలెన్‌కు ఏమీ తెలియదని, వీపుమీద వ్రణం వస్తే డ్రెస్సింగ్ ఏ విధంగా చేసుకోవాలో తెలియదని ఎంగెల్స్‌కు తన గోడు వెళ్లబోసుకున్నాడు.

1865 జనవరి నుంచి మే వరకు మార్క్స్ వాల్యూమ్ 2లో భాగాలను రాశాడు. రాతప్రతులను మూడు చాప్టర్లుగా విభజించాడు. ఇవి ఎంగెల్స్ 1885లో ప్రచురించిన పుస్తకంలో చేర్చారు. 1) పెట్టుబడి రూపాంతరం చెందడం. 2) పెట్టుబడి టర్నోవర్. 3) సర్కులేషన్ అండ్ రీ ప్రొడక్షన్. ఈ పేజీలలో మార్క్స్ కొత్త భావనలను అభివృద్ధి చేసి వాల్యూమ్ 1, వాల్యూమ్ 2లోని సిద్ధాంతాలతో అనుసంధానం చేశాడు.

కొత్త సంవత్సరంలో కూడా వ్రణాలు ఆయనను ఇబ్బందిపెడుతూనే ఉన్నాయి. ఫిబ్రవరి మధ్య భాగంలో మరోసారి ఈ వ్యాధి తిరగబెట్టింది. గత సంవత్సరం మాదిరిగా ఇది మానసిక, శారీరిక సామర్థ్యానికి ఆటంకం కలిగించలేదని, మామూలుగా పని చేయగలుగుతున్నానని ఆయన ఎంగెల్స్‌కు తెలియజేశాడు. ఈ విధంగా ఆలోచించడం అత్యాశ అవుతుందని తరువాత తెలిసివచ్చింది. మార్చిలో వ్యాధి మళ్లీ తిరగబెట్టింది. అందువల్ల ఆయన కూర్చోడానికి కూడా వీలుకాక చాలా ఇబ్బందిపడ్డాడు. వ్రణాల బాధకు తోడు, ఇంటర్నేషనల్‌లో కూడా ఆయన చాలా ఎక్కువ పని చేయవలసి వచ్చింది. అయినప్పటికీ ఆయన పుస్తకం పని ఆపలేదు. తెల్లవారుజామున 4 గంటల వరకు ఆయన పని చేసేవాడు.

పుస్తకంలో మిగిలిన భాగాలను పూర్తి చేయవలసిందిగా మార్క్స్‌పై ఒత్తిడి ప్రారంభమైంది. పబ్లిషర్స్‌తో ఉన్న కాంట్రాక్ట్ ఒకవైపు, మరోవైపు, తోటివారు ఒత్తిడి చేశారు. కమ్యూనిస్టు లీగ్‌లో సభ్యుడైన పాతమిత్రుడు, విల్ హెల్మ్ స్ట్రోహన్ ఈ విషయంలో జోక్యం చేసుకోవడం హర్షించవలసిన అంశం. హాంబర్గ్ గురించి ఓటో మీస్నెర్ (1819–1902) మార్చి 21వ తేదీన లేఖ రాస్తూ, దానికి 'ది వర్కింగ్ క్యాపిటల్ : కంట్రిబ్యూషన్

టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' కాంట్రాక్ట్ ప్రతిని కూడా జతచేశాడు. దాని ప్రకారం రెండు వాల్యూమ్‌లకు అవసరమయ్యే 50 సిగ్నేచర్‌ల (అచ్చు వేసిన తరువాత దాదాపు ఎనిమిది వందల పేజీలకు) సరిపడే ప్రతులను అందజేయవలసి ఉంది.

'వ్యవధి తక్కువగా ఉంది. రాత్రుళ్లు మేలుకొని ఉండి పనిచేస్తున్నందువల్ల (...) నేను వేసుకుంటున్న ప్రమాదకరమైన మందు వల్ల నా పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని (...)' మార్క్స్ ఏప్రిల్ నెలాఖరులో ఎంగెల్స్‌కు లేఖ రాశాడు. మే నెలలో ఆయనకు ఎడమ పిరుదుపై పెద్ద వ్రణం వచ్చింది. 'చెప్పుకోడానికి వీలులేని భాగంలో వచ్చిందని' లేఖలో తెలిపాడు. వారం రోజుల తరువాత వ్రణాలు ఇతర శరీర భాగాలకు మాత్రమే పరిమితమయ్యాయి. అదృష్టవశాత్తు తలపై రాలేదు. ఆయన మన పని చేయగలిగినపుడల్లా పనిచేస్తూ ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. 'ఒంటె మాదిరిగా నిర్విరామంగా పని చేస్తున్నానని' ఎంగెల్స్‌కు తెలియజేశాడు.

మే నెల చివరి వారంలో ప్రారంభించి, జూన్ ఆఖరు నాటికి మార్క్స్ 'వేజెస్, ప్రైస్ అండ్ ప్రాఫిట్' అనే పేరుతో చిన్న పుస్తకం రాశాడు. వేతనాల పెరుగుదల కార్మిక వర్గానికి అనుకూలమైనది కాదని, అధిక వేతనాల కోసం కార్మిక సంఘాలు డిమాండ్ చేయడం వల్ల హాని జరుగుతుందని జాన్ వెస్టన్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని, ఈ పుస్తకంలో మార్క్స్ తీవ్రంగా విమర్శించాడు. అంతేకాకుండా, 'వేతనాలు పెరిగినప్పుడు సాధారణ రేటు తగ్గుతుందని, వస్తువుల ధరలు పెరగబోవని, వాటి విలువ తగ్గదని' మార్క్స్ ఈ పుస్తకంలో రుజువు చేశాడు.

ఇదే కాలంలో వాల్యూమ్ 3 లోని నాలుగో భాగాన్ని రాయడం పూర్తిచేశాడు. దీనికి 'కన్వర్షన్ ఆఫ్ కమోడిటీ – క్యాపిటల్ అండ్ మనీ – క్యాపిటల్ ఇన్ టు కమర్షియల్ క్యాపిటల్ అండ్ మనీ – డీలింగ్ క్యాపిటల్ (మర్చంట్స్ క్యాపిటల్)'. (మారకపు వస్తువు–పెట్టుబడి; ద్రవ్యము–పెట్టుబడి; వాణిజ్య పెట్టుబడిగా, ద్రవ్యపరమైన పెట్టుబడిగా (మర్చంట్ క్యాపిటల్) మారడం) 1865 జులై ఆఖరులో మార్క్స్ తాను సాధిస్తున్న ప్రగతి గురించి ఎంగెల్స్‌కు వివరించాడు :

సైద్ధాంతిక భాగం పూర్తి చేయడానికి ఇంకా మూడు చాప్టర్లు (మూడు పుస్తకాలలో) రాయవలసి ఉందని, చారిత్రక – సాహిత్యపరమైన నాలుగో పుస్తకం ఇంకా రాయవలసి ఉందని, ఇతర భాగాలతో పోల్చి చూసినప్పుడు ఇది రాయడం తనకు చాలా తేలికని, మొదటి మూడు పుస్తకాలు దాదాపుగా పూర్తి అయినందువల్ల, నాలుగోది చారిత్రక రూపంలో

ఉంటుందని, అది కేవలం మళ్ళీ రాయడం అవుతుందని మార్క్స్ వివరించాడు. కానీ నేను రాయదలచుకున్నది పూర్తిగా నా ముందున్నప్పుడు మాత్రమే పబ్లిషర్‌కు పంపుతానని ఆయన వెల్లడించాడు. ఎన్ని లోపాలున్నప్పటికీ నా రచనలు కళాత్మకంగా సంపూర్ణమైనవి. అందువల్ల ప్రయోజనం ఉంటుంది. అవి పూర్తిగా నా ముందుకు వచ్చిన తరువాతనే అచ్చు వేయడానికి ఇచ్చే నా అలవాటుతో ఈ సంపూర్ణత సాధ్యమవుతుంది.

తప్పనిసరి పరిస్థితులలో రాతపని నెమ్మదిగా సాగడం, అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురుకావడంతో తన పనిచేసే తీరును మరోసారి సమీక్షించుకోవలసిన అవసరముందని మార్క్స్ భావించాడు. ముందుగా వాల్యూమ్ 1ని పూర్తి చేయడం మంచిదా? లేక మొత్తం వాల్యూమ్‌లను ఒకేసారి పూర్తిచేయడం మంచిదా? అని మార్క్స్ తనని తాను ప్రశ్నించుకున్నాడు. ఇదే విషయాన్ని ఎంగెల్స్‌కు లేఖ రాశాడు. మొత్తం పనిని ఒకేసారి పూర్తి చేయాలని కోరుకుంటున్నానని వాల్యూమ్ 1ని ముందుగా పూర్తిచేసి పబ్లిషర్స్‌కు పంపినప్పటికీ ఇతర వాల్యూమ్‌ల కోసం తాను చేస్తున్న శ్రమ వృధా కాకూడదని ఎంగెల్స్‌కు వివరించాడు.

(ప్రస్తుత పరిస్థితులలో) పని చాలా వేగంగా సాగుతున్నదని, అయితే ఇందులో కళాత్మక అంశాలను పట్టించుకోవడంలేదని, తాను రోజుకు గరిష్టంగా 60 పేజీల వరకు రాయగలనని మొత్తం పని తనముందు పెట్టుకోవడం తప్పనిసరని, పరిమితులకు కట్టుబడి కుదించవలసిన, తొలగించవలసిన, విశేషాలు నిర్ణయించి, ప్రతి విభాగంలో సమతూకం తెచ్చుకోడానికి ఇది తప్పనిసరని మార్క్స్ వివరించాడు.

దీనిని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి తాను అన్ని విధాలా కృషి చేస్తున్నానని, ఇది పీడకల మాదిరిగా, ఆహారంగా తయారయిందని, దీని కారణంగా ఇతర పనులు చేయలేకపోతున్నానని, రాజకీయ ఉద్యమం ఇవ్వడానికి ముందే దీని పని పూర్తి చేయాలని కోరుకుంటున్నట్టు, మార్క్స్ తెలియజేశాడు. ప్రస్తుతం పరిస్థితులు నిలకడగా ఉన్నట్టు, ఎల్లకాలం ఉండబోవని ఆయన స్పష్టం చేశాడు.

ముందుగా వాల్యూమ్ 1 పూర్తి చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ, వాల్యూమ్ మూడు పనిని పక్కకు పెట్టాలని మార్క్స్ అనుకోలేదు. 1865 జూలై నుంచి డిసెంబర్ మధ్య కాలంలో నిర్దిష్టంగా లేకపోయినప్పటికీ వాల్యూమ్ 3 లోని ఐదో భాగం (వడ్డీ – పరిశ్రమ లాభంగా, లాభ విభజన, పెట్టుబడికి లభించే వడ్డీ), ఆరో భాగం (అదనపు లాభం, భూమికి అద్దెగా మారడం), ఏడో భాగం (ఆదాయాలు, వాటి వనరులు) లను రాయడం

పూర్తి చేశాడు. 1864 వేసవి నుంచి 1865 చివరివరకు మార్క్స్ వాల్యూమ్ 3కు ఇచ్చిన నిర్మాణ స్వరూపం, 1863 జనవరిలో అదనపు విలువ సిద్ధాంతం నోట్ బుక్ 18లో రూపొందించిన అదనపు విలువ సిద్ధాంతాల 12 పాయింట్ల ముసాయిదా దాదాపు ఒక్కటిగానే ఉన్నాయి.

ఆర్థిక ఇబ్బందులు లేకపోవడంతో మార్క్స్ పూర్తిగా పనిలో మునిగిపోయాడు. అయితే ఈ పరిస్థితి ఎక్కువకాలం నిలవలేదు. సంవత్సరం గడిచిందో లేదో మళ్లీ ఆర్థిక ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. వేసవిలో మళ్లీ ఆయన అనారోగ్యానికి గురయ్యాడు. వీటన్నిటికీ తోడు సెప్టెంబర్‌లో లండన్‌లో జరుగనున్న ఇంటర్నేషనల్ మొదటి మహాసభ కారణంగా ఆయన ఎక్కువగా పని చేయవలసి వచ్చింది. అక్టోబర్‌లో ఆయన మాంచెస్టర్ వెళ్లి ఎంగెల్స్‌ను కలుసుకున్నాడు. ఆయన లండన్ తిరిగి వచ్చినప్పుడు, మరింత తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. ఆయన కూతురు లారా అనారోగ్యానికి గురయ్యింది. ఇంటి అద్దె చెల్లించకపోతే ఖాళీ చేయిస్తానని, పోలీసులను పంపుతానని యజమాని బెదిరించడం ప్రారంభించాడు. ఇతర సమస్యలకు సంబంధించి కూడా బెదిరింపు ఉత్తరాలు వచ్చేవి. దిక్కుతోచని స్థితిలో ఆయన భార్య జెన్నీని చూసి ఆయన ఎంగెల్స్‌కు లేఖ రాశాడు.. 'వాస్తవ పరిస్థితులను జెన్నీకి వివరించడానికి కూడా ధైర్యం చేయలేక పోయానని, నిజానికి ఏం చేయాలనేది పాలుపోవడం లేదని' ఆయన వివరించాడు. ఒకే ఒక మంచి వార్త ఏమంటే, ఫ్రాంక్‌ఫర్ట్‌లో నివసిస్తున్న ఆంటీ 73 సంవత్సరాల వయసులో మరణించింది. ఆమె నుంచి తనకు వారసత్వంగా స్వల్పంగా డబ్బు అందే అవకాశం ఉంది.

3

వాల్యూమ్ 1 పూర్తి చేయడం

1866 ప్రారంభంలో క్యాపిటల్, వాల్యూమ్ 1కి మార్క్స్ కొత్త ముసాయిదా రాయడం ప్రారంభించాడు. జనవరి మధ్యలో విల్ హెల్మ్ లీబ్క్నెంట్ (1826–1900) కు తన పరిస్థితిని వివరించాడు. 'అనారోగ్యం, (...) అనేక రకాల ఇబ్బందులతో పాటు ఇంటర్నేషనల్ పనుల కారణంగా కూడా నాకు నిమిషం తీరిక లేకుండాపోయింది. రాతప్రతిని మేలుప్రతిగా రాయడానికి కూడా సమయం చిక్కడం లేదు. 'ఏది ఏమైనప్పటికీ తాను రాయడం దాదాపుగా పూర్తి కావచ్చిందని, మార్చిలో పబ్లిషర్‌కు వాల్యూమ్ 1 అందజేస్తానని, రెండు వాల్యూములు ఒకేసారి అచ్చవుతాయని ఆయన వెల్లడించాడు. కుగుల్‌మాన్‌కు రాసిన మరొక లేఖలో 'తాను రోజుకు 12 గంటలు పనిచేస్తూ రాతప్రతి తిరిగి రాస్తున్నానని' ఆయన వెల్లడించాడు. రెండు మాసాలలో హాంబర్గ్‌లోని పబ్లిషర్‌కు రాతప్రతి అందజేస్తానని ఆయన తెలిపాడు.

తర్వాత కొద్ది రోజులకు మార్క్స్ తీవ్రమైన అస్వస్థతకు గురయ్యాడు. ఆయనకు ప్రాణాపాయ స్థితి ఏర్పడింది. మళ్లీ కోలుకొని రాత మొదలుపెట్టడానికి వీలు కుదిరిన తరువాత ఆయన ఎంగెల్స్‌కు ఈ విధంగా తెలియజేశాడు :

ఈసారి నిజంగా తీవ్రమైన ప్రమాదం ఎదురైంది. నాకు వచ్చిన వ్యాధి ఎంత తీవ్రమైనదో నా కుటుంబ సభ్యులకు తెలియదు. ఇదే విధంగా మూడు లేదా నాలుగు సార్లు వస్తే మరణించడం ఖాయం. కొన్ని రోజులు విశ్రాంతిగా గడిచిపోయినప్పటికీ ఇంకా నేను బలహీనంగానే ఉన్నాను. కానీ మనసుకు బలహీనత లేదు. కాళ్లు, నడుము చాలా బలహీనంగా ఉన్నాయి. వ్యాధి తిరగబెట్టడానికి అధికంగా శ్రమ చేయడం, రాత్రుళ్ళు కూడా పనిచేయడం కారణం అని డాక్టర్లు సరిగ్గానే గుర్తించారు. నేను ఎటువంటి పరిస్థితులలో అతిగా ఎందుకు పని చేస్తున్నాననేది, ఈ డాక్టర్లకు చెప్పలేను. చెప్పినా ప్రయోజనం ఉండదు. ఈ క్షణంలో శరీరమంతా వ్రణాలున్నాయి. చాలా బాధగా ఉంది. కానీ ప్రమాదభరితమైనవి కావు.

ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ మార్క్స్ ఆలోచనలు తాను చేయవలసిన పనిపై కేంద్రీకృతమై ఉన్నాయి :

జనవరి ఒకటో తేదీ నుంచి అద్భుతంగా కొనసాగుతున్న పనికి, కాలేయ వ్యాధి మూలంగా అంతరాయం ఏర్పడి చాలా చికాకు కలిగిస్తున్నది. కూర్చోడానికి కూడా అవకాశం లేదు. (...) రోజులో కొద్దిసార్లు పని చేయగలిగినా నా పని ముందుకు సాగేది. కానీ సైద్ధాంతికంగా ఏమాత్రం ప్రగతి సాధించలేకపోయాను. నా మెదడు సహకరించలేకపోయింది. అందువల్ల నేను 'పని దినం' భావనను చారిత్రక దృక్పథంతో వివరంగా రాశాను. ఇది అసలు ప్లాన్‌లో లేదు.

'నా పుస్తకం పూర్తి చేయడానికి రాయగలిగిన సమయమంతా కేటాయిస్తాను' అనే మాటలతో లేఖను ముగించడాన్నిబట్టి మార్క్స్ తన జీవితంలో ఈ కాలానికి ఆయన ఇచ్చిన ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. 1866వ సంవత్సరం చాలా ముఖ్యమైన కాలం అనేది అందరికీ తెలిసిందే.

ఈ పరిస్థితి చూసి ఎంగెల్స్ తీవ్రమైన ఆందోళనకు గురయ్యాడు. అసలుకే మోసం వస్తుందని గ్రహించి, ఆయన జోక్యం చేసుకున్నాడు. అదే తీరులో పని చేయడం మంచిది కాదని మార్క్స్‌ను ఒప్పించడానికి ప్రయత్నం చేశాడు :

'నీ పుస్తకం మరో మూడు నెలల పాటు ఆలస్యమైనా, ముందుగా నువ్వు వ్రణాల సమస్య నుంచి బయటపడాలి. దీనికోసం నువ్వు అర్థవంతమైన ప్రయత్నం చేయాలి. ఈ సమస్య చాలా తీవ్రమైనదిగా పరిణమిస్తున్నది. సైద్ధాంతికపరమైన పని చేస్తున్నప్పుడు మెదడు సహకరించడం లేదని నువ్వే చెబుతున్నావు. విస్తృత సైద్ధాంతిక కృషి నుంచి కొంతకాలం విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొంతకాలం రాత్రిపూట ఎక్కువగా పనిచేయడం నిలిపివేయాలి. సాధ్యమైనంతవరకు మామూలు జీవితం గడపడానికి ప్రయత్నం చేయాలి' అని ఆయన మార్క్స్‌ను కోరాడు.

ఎంగెల్స్ వెంటనే డాక్టర్ గుంపెర్ట్‌ను సంప్రదించాడు. మరోసారి ఆర్సెనిక్ మందు వాడాలని డాక్టర్ సూచించాడు. పుస్తకం పూర్తి చేయడం గురించి కూడా మార్క్స్‌కు ఎంగెల్స్ సలహా ఇచ్చాడు. క్యాపిటల్ పూర్తిగా రాసేవరకు అందులో ఏ భాగం అచ్చు వేయకూడదనే అభిప్రాయం వాస్తవానికి దూరంగా ఉందని, ఆయన చెప్పాడు. ముందుగా వాల్యూమ్ 1 అచ్చు వేయడానికి ఇచ్చి తరువాత రెండు మూడు మాసాల్లో వాల్యూమ్ 2 కూడా ఇవ్వడానికి ప్రయత్నించడం మంచిదని ఆయన సలహా ఇచ్చాడు. పరిస్థితులన్నిటిని పరిగణలోకి తీసుకొని ఆయన మంచి సలహా ఇచ్చాడు. 'అనుకోని సంఘటనలు జరిగితే

మొత్తం పుస్తకంలో మరికొన్ని చాప్టర్లు రాయలిగినప్పటికీ, వ్యాల్యూమ్ 1 అచ్చు వేసే పరిస్థితి కూడా ఉండదు' అని ఎంగెల్స్ వివరించాడు.

ఎంగెల్స్ ప్రస్తావించిన అన్ని అంశాలకు మార్క్స్ వాస్తవాలను తెలియజేస్తూ, ప్రతి అంశం తీవ్రతను వివరిస్తూ లేఖ రాశాడు. ఆర్సెనిక్ మందుకు సంబంధించి దానిని వాడే విధానం, తదితర వివరాలతో డాక్టర్ గుంపేర్ట్ నుంచి ప్రిస్క్రిప్షన్ తీసుకోవలసిందిగా ఆయన ఎంగెల్స్‌ను కోరాడు. నాకు డాక్టర్‌పై నమ్మకం ఉన్నందువల్ల, మాంచెస్టర్ నుంచి ఆయన చేస్తున్న సేవలు రాజకీయ, ఆర్థిక శాస్త్రానికి ఉపయోగపడతాయని ఆయన తెలిపాడు. తన పనికి సంబంధించిన ప్లాన్ కూడా ఆయన వివరించాడు :

ఇక నన్ను వెంటాడుతున్న పుస్తకం పరిస్థితి : డిసెంబర్ చివరకు అది సిద్ధమవుతుంది. భూమి అద్దెకు సంబంధించి నేను రూపొందించిన (చివరి దానికన్నా ముందున్న) చాప్టర్ ప్రస్తుత రూపంలో అదొక్కటే ఒక పుస్తకంగా తయారవుతుంది. పగలు నేను బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయానికి వెళుతూ రాత్రిపూట రాసుకుంటున్నాను. జర్మనీలో కొత్తగా ఆవిర్భవించిన వ్యవసాయ రసాయన శాస్త్రం గురించి నేను పెద్ద ఎత్తున సమాచారం సేకరించవలసి వచ్చింది. ప్రత్యేకించి లీబిగ్, స్నొబీన్ గురించి సమాచారం సేకరించ వలసి వచ్చింది. ఆర్థికవేత్తలు అందరినీ కలిపి చూసినప్పటికీ వారికన్నా వ్యవసాయ రసాయన శాస్త్ర ప్రాధాన్యం చాలా ఎక్కువ. ఇంతకుముందు నేను చూసినప్పటికన్నా ఫ్రెంచ్‌వారు దీనికి సంబంధించి విస్తృత సమాచారం ప్రచురించారు. భూమి అద్దెకు సంబంధించిన నా సైద్ధాంతిక పరిశోధన రెండు సంవత్సరాల క్రితమే పూర్తి చేశాను. ఈ రంగంలో ఈ రెండు సంవత్సరాల కాలంలో పెద్ద ఎత్తున ప్రగతి సాధించారు. ఈ ప్రగతి నా సిద్ధాంతాన్ని రుజువు చేస్తున్నది. ఆ తరువాత జపాన్‌లో (వృత్తిపరంగా అవసరమైతే తప్ప నేను సాధారణంగా ట్రావెల్ పుస్తకాలు చూడను.) కొనసాగుతున్న 'షిఫ్ట్ పద్ధతిని' 1848-50 మధ్యకాలంలో జుగుప్స కలిగించే ఇంగ్లీష్ తయారీదారులు అమలు చేశారు. దీనిని నాకు నేనే వర్తింపచేసుకున్నాను.

తాజా పరిశోధనల వివరాలు తెలుసుకోవడానికి పగలంతా గ్రంథాలయంలో, రాత్రిపూట రాతప్రతి రాయడంలో మార్క్స్ మునిగిపోయాడు. పుస్తకం పూర్తి చేయడానికి తన శక్తినంతటిని కూడగట్టుకొని క్రమం తప్పకుండా ఇటువంటి కఠినమైన శ్రమ చేస్తూ తనని తాను శిక్షించుకుంటున్నట్టుగా కృషి చేశాడు.

'ముసాయిదా పూర్తిగా తయారయినప్పటికీ, అది చాలా పెద్దదిగా ఉంది. దాన్ని ప్రచురించడం ఆ ఒక్కడివల్లే అవుతుంది. వేరే ఎవరికీ సాధ్యం కాదు. నీకు కూడా వీలు

కాదు' అని ఎంగెల్స్‌కు లేఖ రాస్తూ, ఆయన అంతకుముందు వారాలలో చేసిన కృషిని వివరించాడు :

నా పుస్తకానికి మెరుగులు దిద్దుతూ కాపీ చేసే పని జనవరి ఒకటో తేదీన ప్రారంభించారు. అది సజావుగా సాగిపోతున్నది. పశువులు ఈనిన వెంటనే తమ బిడ్డలను నాకి శుభ్రం చేసినట్టు, నేను కూడా పని చేస్తున్నాను. కానీ మళ్ళీ ఒక వ్రణం అడ్డుపడింది. ఆ తరువాత నేను పెద్దగా ప్రగతి సాధించలేకపోయాను. అయితే మొదటి ప్లాన్ ప్రకారం దాదాపు పూర్తి చేసిన కొన్ని విభాగాలలో వాస్తవాలను నింపే పని చేస్తున్నాను.

తన పుస్తకాల ప్రచురణ వ్యవధిని ప్రకటించాలని ఎంగెల్స్ చేసిన సూచనలను చివరకు మార్క్స్ ఆమోదించాడు. 'నేను నీ సూచనకు అనుగుణంగా మొదటి వాల్యూమ్ రెడీ కాగానే మీస్నర్‌కు పంపుతాను. అయితే నేను కూర్చోడానికి కూడా వీలు లేకుండా ఉంది.'

నిజానికి మార్క్స్ ఆరోగ్యం దిగజారుతూనే ఉంది. ఫిబ్రవరి మాసంలో శరీరంపై మరో రెండు పెద్ద వ్రణాలు వచ్చాయి. వాటికి తానే చికిత్స చేసుకోవడానికి ప్రయత్నం చేశాడు. 'పదునైన రేజర్‌తో నేనే స్వయంగా వ్రణం పైభాగం తొలగించాను. వ్యాధి సోకిన రక్తం గాలిలోకి చిమ్మింది. దీనితో వ్రణాలు పూర్తిగా తగ్గిపోయినట్టేనని అనుకున్నాను. అయితే దీనికి సేవలు తీసుకోక తప్పలేదు. అయితే రెండో వ్రణం బాగా మొండికేసింది. నేను దానిని అదుపు చేయలేకపోయాను. (...) వ్రణాలు ఇదే విధంగా కొనసాగితే మళ్ళీ డాక్టర్‌ను పిలిపించక తప్పదు. వ్రణం లోపలి భాగం చూడడం లేదా చికిత్స చేసుకోవడం నావల్ల కాలేదు' అంటూ ఎంగెల్స్‌కు లేఖ రాశాడు.

ఇది తెలుసుకున్న ఎంగెల్స్, స్నేహితుడిని ఇంతకు ముందెన్నడూ లేని విధంగా తీవ్రస్థాయిలో మందలించాడు. 'ఇంత దీర్ఘకాలం వ్రణాలను తట్టుకోవడం చాలా కష్టమే. ఈ పరిస్థితులలో బాగుచేయడానికి వీలుగాని వ్రణం వస్తే, అది నిన్ను మట్టుబెట్టే అవకాశం ఉంది. అప్పుడు నీ పుస్తకం ఏమవుతుంది? నీ కుటుంబం ఏమవుతుంది?' అని ఎంగెల్స్ ప్రశ్నించాడు. తాను ఎటువంటి ఆర్థిక సహాయం చేయడానికైనా సిద్ధమేనని హామీ ఇచ్చాడు. దీనితో మార్క్స్‌కు ఉపశమనం లభించింది. జాగ్రత్తగా ఉండాలని, కొంత కాలం పూర్తి విశ్రాంతి తీసుకోవాలని మార్క్స్‌ను ఎంగెల్స్ ప్రాధేయపడ్డాడు :

నువ్వు ఈ వ్యాధిని నయం చేసుకొని నీ కుటుంబానికి, నాకు కూడా మేలు చేయాలి. ఏదైనా జరిగితే ఉద్యమమంతా ఏమవుతుంది? నువ్వు ఇదే విధంగా పని చేస్తూపోతే ఈ పరిస్థితి తప్పనిసరిగా ఎదురవుతుంది. నీకు ఈ వ్యాధి వచ్చినప్పటినుంచి నాకు రాత్రి,

పగలు కూడా ప్రశాంతత లేకుండాపోయింది. ఏ రోజు ఏ కబురు వినవలసివస్తుందో అని భయపడుతూ ప్రతి రోజు కాలం వెళ్లదీస్తున్నాను. మళ్లీ వ్రణాలు వచ్చాయని, ఈ పరిస్థితి మరింత దిగజారిందని అనుకుంటున్నాను. ఈ పరిస్థితి నాకు చాలా బాధ కలిగిస్తున్నది. జాగ్రత్త (nota bene). నేను రేజర్‌తో వ్రణాన్ని తొలగించాను, మరొక దానిని తొలగించలేకపోయాను అనే పరిస్థితికి వెళ్ళవద్దు. అది చాలా ప్రమాదకరమైనది.

చిట్టచివరకు పని నుంచి విశ్రాంతి తీసుకోడానికి మార్క్స్ కూడా ఒప్పుకున్నాడు.

మార్చి 15వ తేదీన టెంపుల్‌లోని సముద్ర తీరంలోని రిసార్ట్‌కు బయలుదేరి వెళ్లాడు. పది రోజుల తర్వాత తన పరిస్థితిని ఎంగెల్స్‌కు వివరించాడు. 'నేను చదవడం లేదు. రాయడం లేదు. రోజుకు మూడుసార్లు ఆర్సెనిక్ మందు వేసుకున్నందువల్ల కేవలం భోజనం చేయడం, తిరగడానికి మాత్రమే ఉపయోగపడుతున్నది. (...) ఇక్కడ మిత్రులు ఎవరూ లేరు. నేను 'మిల్లర్ ఆఫ్ ది డెక్' అంటూ పాటలు పాడుకుంటున్నాను. 'నేను ఎవరిని పట్టించుకోవడంలేదు. నన్ను ఎవరూ పట్టించుకోవడం లేదు.'

ఏప్రిల్ ప్రారంభంలో తన మిత్రుడు కుగుమాన్‌కు లేఖ వ్రాస్తూ తాను చాలావరకు కోలుకుంటున్నానని మార్క్స్ తెలియజేశాడు. కానీ రెండు లేదా మూడు మాసాలలో చేయవలసిన పని పూర్తిగా నష్టపోయినట్టు ఆయన వాపోయాడు. పుస్తకం పూర్తి కావడం అనేది కూడా వాయిదా పడిందని ఆయన వెల్లడించాడు. లండన్‌కు తిరిగి వచ్చిన తరువాత మోకాలి నొప్పులు, తదితర సమస్యలతో మరి కొన్ని వారాలపాటు ఏమి పని చేయలేక పోయాడు. ఆయన బాగా అలసిపోయినందువల్ల అనారోగ్యం చోటుచేసుకునే పరిస్థితి ఏర్పడింది. అదృష్టవశాత్తు తనకు వ్రణాలు రాలేదని జూన్ ప్రారంభంలో ఆయన ఎంగెల్స్‌కు తెలియజేశాడు. కేవలం శారీరక అనారోగ్యం వల్ల తన పని కుంటుపడుతున్నందుకు ఆయన విచారం వెలిబుచ్చాడు.

మార్క్స్ మూడు ప్రధానమైన సమస్యలతో ఇబ్బంది పడేవాడు. (Livy's periculumin mora) అంటే వాటి కారణంగా జాప్యం జరిగే ప్రమాదం ఎదురవుతూ ఉండేది. ఇంటి అద్దె బకాయిలు, వ్రణాలు, తాజాగా కాలేయ సమస్య ప్రారంభమైంది. జూలైలో మార్క్స్ వీటన్నిటిని ఒకేసారి ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. తన ఆరోగ్యం ప్రతిరోజు ఒడుదుడుకులకు లోనవుతున్నప్పటికీ పరిస్థితి మెరుగ్గానే ఉందని, తాను పని చేయగలిగే పరిస్థితిలో ఉండడం ఎంతో ఉత్సాహం కలిగిస్తుందని, ఆగస్టులో ఆయన ఎంగెల్స్‌కు తెలియజేశాడు. శరీరంపై అక్కడక్కడ కొత్త వ్రణాలు వస్తున్నప్పటికీ అవి మళ్లీ తగ్గిపోతున్నాయి. అందువల్ల డాక్టర్ అవసరం పడలేదు. తాను పరిమితంగా కొన్ని గంటలు

మాత్రమే పని చేయగలుగుతున్నానని లేఖలో ఎంగెల్స్‌కు తెలిపాడు. అదే రోజు కుగుల్‌మాన్‌కు రాసిన లేఖలో 'మొదటి వాల్యూమ్ రాతప్రతులను అక్టోబర్‌లోగా హాంబర్గ్‌లోని పబ్లిషర్‌కు అందజేసే పరిస్థితి కనబడడం లేదని, కొద్ది గంటలు మాత్రమే పని చేయగలుగుతున్నానని ఆయన వివరించాడు.

ఈసారి కూడా ఆయన చాలా ఆశావాదిగా కనిపించాడు. ఆయన నిత్యం ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులలో పుస్తకం పూర్తి చేయడానికి మరొక అవాంతరం తలెత్తింది. దీనికితోడు వస్తువులు తాకట్టు పెట్టి చిన్న చిన్న మొత్తాలను సమకూర్చుకోవడానికి కూడా ఆయన సమయం వెచ్చించాల్సి వచ్చింది. హింసకు గురిచేస్తున్న తిరగరాసిన అనేక ప్రామిసరీ నోట్ల సమస్యను కూడా పరిష్కరించవలసి వచ్చింది.

అక్టోబర్ మధ్యలో కుగుల్‌మాన్‌కు లేఖ రాస్తూ, దీర్ఘకాలిక అనారోగ్యం, దానికోసం డబ్బు ఖర్చు పెట్టడం తదితర కారణాలవల్ల అప్పుల వాళ్లకు జవాబు చెప్పలేని పరిస్థితి వచ్చిందని, తన కొంప కూలిపోవడం తథ్యమని స్పష్టంగా తెలుస్తున్నదని మార్క్స్ వివరించాడు. అక్టోబర్‌లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నపుడు, రాతప్రతికి తుది మెరుగులు దిద్దడం సాధ్యం కావడంలేదని ఆయన వెల్లడించాడు. తన స్నేహితునికి పరిస్థితి వివరిస్తూ, దానికి కారణాలు తెలుపుతూ, రాతప్రతి పూర్తిచేయడానికి ప్రస్తుతం తన మనసులోని ప్రణాళిక ఆయన వ్యక్తం చేశాడు.

నేనున్న పరిస్థితులలో (శారీరక, సామాజికపరమైన అంతులేని అవాంతరాలు ఏర్పడుతున్నందువల్ల) ఇంతకుముందు అనుకున్నట్టు రెండు వాల్యూమ్‌లు ఒకేసారి ముద్రణకు ఇచ్చే ప్రయత్నం చేయకుండా, ముందుగా వాల్యూమ్ 1ని ముద్రణకు సిద్ధం చేయాలని నిర్ణయించుకున్నాను. అప్పుడు పుస్తకం మూడు వాల్యూమ్‌లు అవుతుంది. పుస్తకాన్ని కింది భాగాలుగా విభజించడం అవసరం.

పుస్తకం 1. పెట్టుబడి ఉత్పత్తి క్రమం.

పుస్తకం 2. పెట్టుబడి చెలామణి క్రమం.

పుస్తకం 3. సంపూర్ణ నిర్మాణం, క్రమం.

పుస్తకం 4. సైద్ధాంతిక చరిత్ర

మొదటి రెండు పుస్తకాలు మొదటి వాల్యూంలో, రెండో వాల్యూంలో మూడో భాగంలో, మూడో వాల్యూంలో 4వ పుస్తకం చేర్చాలని అనుకుంటున్నాను.

1859లో 'కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' ప్రచురించిన తరువాత తాను చేస్తున్న కృషిని సమీక్షిస్తూ మార్క్స్ ఈ విధంగా చెప్పాడు :

మొదటి పుస్తకంలో మళ్ళీ మొదటి నుంచి ప్రారంభించాలని నా అభిప్రాయం. అంటే డంకెర్ ప్రచురించిన నా పుస్తకంలోని 'వ్యాపార వస్తువులు, ద్రవ్యం'పై చాప్టర్ సారాంశం తీసుకోవడం అవసరం. సమగ్ర రూపం ఇవ్వడమే కాకుండా, అది సమస్యను అర్థం చేసుకోడంలో ఇబ్బందులున్నందువల్ల, వేరే మాటల్లో చెప్పాలంటే ఇంతకుముందు పుస్తకంలో ప్రత్యేకించి వాణిజ్య వస్తువుల విశ్లేషణలో లోపాలున్నందువల్ల ఇది అవసరమని నేను భావిస్తున్నాను.

నవంబర్లో కూడా తీవ్రమైన పేదరికంతో ఇబ్బందులు పడ్డాడు. నిత్యజీవితంలో విశ్రాంతి లేకుండా చేస్తున్న, దుర్భరమైన పరిస్థితులను వివరిస్తూ ఆయన ఎంగెల్స్‌కు లేఖ రాశాడు : 'ఈ పరిస్థితులు నా పనికి ఆటంకం కలిగించడమే కాకుండా, నష్టపోయిన సమయాన్ని కూడా తీసుకోవడానికి రాత్రిపూట పనిచేస్తున్నాను. దీనికితోడు మర్మావయవంపై వ్రణం ఏర్పడింది.' వేసవిలో, శరత్కాలంలో తన అనారోగ్యం, ఆర్థిక పరిస్థితులవల్ల సాధారణంగా జరుగుతున్నదని, ఈ జాప్యానికి సైద్ధాంతిక సమస్యలు కారణం కాదని ఆయన తెలిపాడు. 3 సంవత్సరాల క్రితం నుంచి వ్రణాల సమస్య ప్రారంభమైందని, అప్పటి నుంచి అప్పుడప్పుడు కొద్దిపాటి సమయంలో మాత్రమే పని చేయగలుగుతున్నానని ఆయన గుర్తు చేశాడు. అంతే కాకుండా పేదరికం కారణంగా కాలాన్ని, శక్తిని ఉపయోగించుకోవాల్సి వస్తున్నదని ఆయన వెల్లడించాడు. ఆయన వ్యాపారస్తులకు మాత్రమే దివాలా ప్రకటించడానికి అవకాశం ఉంటుందని, ఇటువంటి అవకాశం ప్రైవేటు వ్యక్తులకు లేకపోవడం దురదృష్టకరమని ఆయన డిసెంబర్లో వాపోయాడు.

చలి కాలంలో కూడా ఆయన సమస్యలకు పరిష్కారం లభించలేదు. 1867 ఫిబ్రవరి చివరలో మాంచెస్టర్‌లోని స్నేహితునికి (ఆయన లేఖ వ్రాసినప్పుడల్లా ఎంతో కొంత సహాయం చేస్తూనే ఉన్నాడు) లేఖ రాస్తూ : 'ఎల్లుండి అంటే శనివారం నాడు దుకాణ దారుడు పోలీసులను పంపుతున్నాడు. అప్పుడు నేను కనీసం 5 పౌండ్లు చెల్లించాలి. (...) నేను చేసే పని త్వరలోనే పూర్తవుతుంది. ఇబ్బందులు లేనిపక్షంలో ఇప్పటికే పని పూర్తయ్యేది.'

1867 ఫిబ్రవరి చివరలో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న శుభవార్త చెప్పాడు. పుస్తకం పని పూర్తయిందని చెపుతూ ఎంగెల్స్‌కు లేఖ రాశాడు. ఇప్పుడా పుస్తకాన్ని జర్మనీకి తీసుకువెళ్లాలి. 'తన దుస్తులను, చేతి గడియారాన్ని అవి ఎప్పుడూ ఉండే చోటికి అంటే తాకట్టుకు తరలించానని, లేనిపక్షంలో జర్మనీ బయలుదేరడం సాధ్యం కాదని ఆయన ఎంగెల్స్‌కు వివరించాడు.

హాంబర్గ్ చేరుకున్న మార్క్స్, పుస్తక ప్రచురణకు మీస్నర్ ప్రతిపాదించిన కొత్త ప్లాన్‌ను ఎంగెల్స్‌తో చర్చించాడు :

పుస్తకాన్ని మూడు వాల్యూమ్‌లుగా విభజించాలని ప్రస్తుతం మీస్నర్ ప్రతిపాదించాడు. నేను అనుకుంటున్నట్టుగా చివరి పుస్తకాన్ని (చారిత్రక- సాహిత్య భాగం) కుదించడాన్ని ఆయన వ్యతిరేకించాడు. ప్రచురణ ప్రాధాన్యతలను అనుసరించి (...) ఈ భాగం చాలా ముఖ్యమైనదని ఆయన తెలిపాడు. దీనికి సంబంధించి ఆయన చెప్పినట్టుగానే చేస్తానని నేను చెప్పానని అంటూ మార్క్స్, ఎంగెల్స్‌కు వివరించాడు.

కొద్దిరోజుల తరువాత ఇదే అభిప్రాయాన్ని బెకర్‌కు కూడా మార్క్స్ వివరించాడు :

ప్రస్తుతం పుస్తకం మూడు వాల్యూమ్‌లుగా వెలువడుతుంది. పుస్తకం పేరు, 'క్యాపిటల్, ఏ క్రిటీక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ'. మొదటి వాల్యూమ్‌లో మొదటి పుస్తకం ఉంటుంది. 'పెట్టుబడి ఉత్పత్తి క్రమం' ఇందులో ఉంటుంది. బూర్జువాకు (భూ యజమానులతో కలిపి) ఇంతకు ముందెన్నడూ లేని తీరులో ఇది బృహత్తర శరాఘాతం అవుతుంది.

హాంబర్గ్‌లో కొద్ది రోజులున్న తరువాత ఆయన హనోవర్ వెళ్ళాడు. అక్కడ తన స్నేహితుడైన కుగుల్‌మాన్‌కు అతిథిగా ఉన్నాడు. చాలా కాలంగా ఉత్తరాల ద్వారా కొనసాగిన స్నేహం, మరింత గాఢమైన స్నేహంగా మారిపోయింది. అమ్మాయికి, మీస్నెర్‌కు ప్రూఫ్ రీడింగ్‌లో సహకరించడానికి మార్క్స్ అక్కడే ఉన్నాడు. తన ఆరోగ్యం చాలా మెరుగైందని, పాత అనారోగ్య సమస్య మళ్ళీ తలెత్తలేదని, కాలేయ సమస్య కూడా లేదని, అన్నిటినీ మించి తాను అత్యంత ఉత్సాహంగా ఉన్నానని ఎంగెల్స్‌కు ఆయన లేఖ రాశాడు. మాంచెస్టర్ నుంచి స్నేహితుడు క్రింది విధంగా జవాబిచ్చాడు :

నువ్వు చాలా కాలంగా రాస్తున్న ఈ పుస్తకం నీకు పెనుభారమయ్యిందని నేను అనుకుంటూనే ఉన్నాను. నీ దురదృష్టాలకు అన్నిటికీ ఇది మూలమని నాకు తెలుసు. ఆ భారం వదిలించుకునే వరకు నీకు సాంత్వన చేకూరదని కూడా నాకు అర్థమైంది. పుస్తకం పూర్తిచేయడంలో ఎదురైన ఆటంకాల కారణంగా నువ్వు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా బాగా కుంగిపోయావని, ఈ పీడకల తొలగిపోగానే నువ్వు నూతన మానవుడిగా రూపొందుతావని కూడా స్పష్టంగానే అర్థమయింది.

తన పుస్తకం ప్రచురిస్తున్నారనే విషయం తన స్నేహితులందరికీ తెలియజేయాలని మార్క్స్ కోరుకున్నాడు. న్యూయార్క్‌లో కార్మిక ఉద్యమం కోసం పనిచేస్తూ, ఇంటర్నేషనల్‌లో సభ్యుడైన జర్మనీకి చెందిన సోషలిస్టు సిగ్‌ఫ్రీడ్ మేయర్ (1840–1872)కు లేఖ రాస్తూ:

'వాల్యూమ్ 1లో పెట్టుబడి ఉత్పత్తి క్రమం ఉంటుంది. (...) వాల్యూమ్ 2లో సైద్ధాంతిక అంశాల కొనసాగింపు, నిర్ధారణ ఉంటాయి. వాల్యూమ్ 3లో 17వ శతాబ్దం మధ్యకాలం నుంచి పొలిటికల్ ఎకానమీ చరిత్ర ఉంటుంది.'

మే–జూన్ 1867 మధ్యకాలంలో గ్రంథానికి సంబంధించి సవరణలు చేయడంలో ఎంగెల్స్ కూడా పనిచేయడం ప్రారంభించాడు. 1859 నాటి 'ఏ కంట్రిబ్యూషన్ టు ది క్రిటీక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ'లో కన్నా, ప్రస్తుత పుస్తకంలో గతితార్కికత చాలా పదునుగా ఉందని ఎంగెల్స్ భావించాడు. ఎంగెల్స్ ఈ వ్యాఖ్య చేసినందుకు మార్క్స్ చాలా సంతోషపడ్డాడు. 'మిగతా ప్రపంచమంతా ఏమి చెప్పినప్పటికీ నువ్వు సంతృప్తి చెందడం చాలా ముఖ్యమైనది' అని మార్క్స్ వ్యాఖ్యానించాడు. కానీ విలువకి సంబంధించి ఎక్కువ భాగం అమూర్తంగా ఉందని, సాధారణ పాఠకుడు స్పష్టంగా తెలుసుకోవడం కష్టమని ఎంగెల్స్ తెలిపాడు. ఈ భాగంపై వ్రణాల బాధ స్పష్టంగా ప్రభావం చూపిందని ఆయన విచారం వెలిబుచ్చాడు. ఈ అభిప్రాయానికి జవాబిస్తూ, మార్క్స్ తన ఇబ్బందులకు కారణమైన బూర్జువాను నిందించాడు. 'ఈ బూర్జువాలు అంతమయ్యే రోజు వరకు నా వ్రణాలను గుర్తుంచుకుంటానని' అన్నాడు. అయితే విలువ రూపంపై అనుబంధాన్ని చేర్చి అందరికీ అర్థమయ్యే విధంగా చేయవలసిన అవసరం ఉందని ఆయన అంగీకరించాడు. జూన్ ఆఖరు నాటికి 20 పేజీల ఈ అనుబంధాన్ని ఆయన రాశాడు.

1867 ఆగస్టు ఒకటో తేదీ తెల్లవారుజాము రెండు గంటలకు ప్రూఫ్ దిద్దే పని మార్క్స్ పూర్తి చేశాడు. కొద్ది నిముషాల తరువాత మాంచెస్టర్‌లోని ఎంగెల్స్‌కు లేఖ రాస్తూ, 'మిత్రమా ప్రూఫ్ దిద్దడంలో చివరి పేజీ కూడా ఇప్పుడే పూర్తి చేశాను. (...) అంటే ఈ వాల్యూమ్ పూర్తి అయినట్టే. ఇది పూర్తి అయిందంటే, నీ ఒక్కడికి మాత్రమే నేను రుణపడి ఉంటాను. (...) హృదయ పూర్వకమైన కృతజ్ఞతలతో నేను నిన్ను ఆలింగనం చేసుకుంటున్నాను. కొద్దిరోజుల తరువాత ఎంగెల్స్‌కు మరొక లేఖ రాస్తూ, తన పుస్తకం సారాంశాన్ని వివరిస్తూ అందులో రెండు చాప్టర్లు మూలస్తంభాల వంటివని తెలిపాడు : '1. (వాస్తవాలను అర్థం చేసుకోవడానికి ఇది మౌలికమైనది.) ఉపయోగ విలువగా, మారకపు విలువగా వ్యక్తమయ్యే తీరును బట్టి శ్రమకు రెండు ప్రధాన లక్షణాలు ఉన్నాయి. దీనిని మొదటి చాప్టర్‌లో చర్చించాను. 2. అదనపు విలువ వ్యక్తమయ్యే లాభం, వడ్డీ, అద్దె తదితర రూపాలతో సంబంధం లేకుండా చర్చించాను.'

1867, సెప్టెంబర్ 11వ తేదీన క్యాపిటల్ పుస్తకాన్ని అమ్మకానికి పెట్టారు. తుది మార్పుల తరువాత విషయసూచిక ఈ విధంగా ఉంది :

ఉపోద్ఘాతం :

1. **వాణిజ్య వస్తువు – ద్రవ్యం**
2. **ద్రవ్యం, పెట్టుబడిగా మార్పు చెందడం**
3. **నిరపేక్ష అదనపు విలువ ఉత్పత్తి**
4. **సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తి**
5. **నిరపేక్ష, అదనపు విలువలపై మరికొంత పరిశోధన**
6. **పెట్టుబడి సంచయ క్రమం**

అనుబంధం ఒకటవ భాగం : 1. విలువ రూపం

సుదీర్ఘ సవరణలు, తుది మార్పులు తరువాత కూడా పుస్తకాన్ని విస్తరించారు. తరువాత సంవత్సరాలలో అనేక మార్పులు కూడా చేశారు. అందువల్ల క్యాపిటల్ ప్రచురించిన తరువాత కూడా ఈ మార్పుల కోసం మార్క్స్ చాలా శ్రమ చేయవలసి వచ్చింది.

4

నిర్ణయాత్మక వ్యక్తీకరణ కోసం అన్వేషణ

1867 అక్టోబర్‌లో మార్క్స్ వాల్యూమ్ 2 పని మళ్లీ ప్రారంభించాడు. కానీ ఆయనకు మళ్లీ అనారోగ్య సమస్యలు తలెత్తాయి. కాలేయం నొప్పి, నిద్ర లేమితోపాటు మర్మావయవంపై మళ్లీ రెండు వ్రణాలు వచ్చాయి. అంతేకాదు, వెలుపలి సమస్యలు అంటే ఇంటి సమస్యలు కూడా ఆయనను వదిలిపెట్టలేదు. 'బహుశా అనారోగ్యం మనసు కారణంగా వస్తున్నదని' ఎంగెల్స్‌కు రాసిన లేఖలో ఆయన వ్యాఖ్యానించాడు. ఎప్పటి మాదిరిగానే ఎంగెల్స్ తాను పంపగలిగినంత డబ్బు పంపించాడు. త్వరలోనే వ్రణాలు తగ్గిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశాడు. కానీ అవి తగ్గలేదు. 'తన ఆరోగ్యం మరింతగా దిగజారిపోయిందని, ఏ మాత్రం పని చేసే పరిస్థితి లేకుండాపోయిందని నవంబర్ చివరలో ఎంగెల్స్‌కు మార్క్స్ లేఖ రాశాడు.

1868 నూతన సంవత్సరంలో కూడా మార్క్స్ ఆరోగ్యం ఏమాత్రం మెరుగుపడలేదు. జనవరి ప్రారంభంలో ఆయనకు ఉత్తరాలు కూడా రాయలేని పరిస్థితి ఏర్పడింది. 'తన భర్త ఆరోగ్యం పూర్తిగా దిగజారిపోయిందని, వ్రణాల సమస్య మళ్లీ తిరగబెట్టడంతో ఆయన కాళ్ళు, చేతులకు సంకెళ్ళు పడినట్టుగానే ఉందని, పదేపదే తిరగబెడుతున్నందువల్ల, తీవ్రమైన బాధ కారణంగా ఆయన పరిస్థితి ప్రమాదకరంగా తయారైందని జెన్నీ, బెకర్‌కు తెలియజేసింది. కొద్దిరోజుల తరువాత ఆయన కూతురు జెన్నీ ఎంగెల్స్‌కు లేఖ రాస్తూ 'మూర్‌కు శత్రువైన వ్రణాలు ఆయనను మళ్లీ బాధిస్తున్నాయని, ఆయనకు తీవ్రమైన అనారోగ్యం వచ్చిందని, కనీసం కూర్చోడానికి కూడా ఆయనకు చేతకావడం లేదని' తెలియజేసింది. ఆ నెల చివరలో మార్క్స్ మళ్ళీ రాయడం ప్రారంభించాడు. 2 లేదా 3 వారాలుగా ఏమాత్రం పని చేయలేకపోయానని, మళ్ళీ మరొక పెద్ద వ్రణం వస్తే, భయానకమైన పరిస్థితి ఏర్పడుతుంది' అని ఎంగెల్స్‌కు తెలియజేశాడు.

మార్క్స్ ఆరోగ్యం ఒడుదుడుకులకు లోనవుతూనే ఉంది. మార్చి చివరలో ఎంగెల్స్‌కు లేఖ రాస్తూ 'తాను కొంత కాలంపాటు ఆలోచించడం, పని చేయడం మానేస్తే

బాగుంటుందని, కానీ భుక్తి గడిచే అవకాశం ఉన్నప్పటికీ తాను ఇటువంటి పరిస్థితికి రావడం సాధ్యం కాదని' తెలియజేశాడు.

1865 మధ్యలో నిలిపివేసిన వాల్యూమ్ 2 పని దాదాపు మూడు సంవత్సరాల తరువాత మళ్లీ ప్రారంభించినప్పుడు, ఈ అవాంతరం ఏర్పడింది. వసంతకాలంలో రెండు చాప్టర్లు రాయగలిగాడు. దీనితోపాటు అదనపు విలువ, లాభం నిష్పత్తి, లాభ నిష్పత్తి సూత్రాల మధ్య సంబంధంపై, పెట్టుబడి రూపాంతరం చెందడంపై ముసాయిదాలను రూపొందించాడు. 1868 చివరివరకు ఈ ముసాయిదా రూపొందించే పని కొనసాగింది.

'లాభాల నిష్పత్తి అభివృద్ధిచెందే క్రమంపై' తన పని కోసం 1868 ఏప్రిల్ చివరలో కొత్త ప్లాన్ రూపొందించి, ఎంగెల్స్‌కు పంపించాడు. 'పెట్టుబడి చలామణి క్రమంపై వాల్యూమ్ 1లో అభివృద్ధి చేసిన సూత్రాలే వాల్యూమ్ 2లో ఉంటాయని అదే లేఖలో మార్క్స్ స్పష్టం చేశాడు. స్థిర పెట్టుబడి, చలామణిలో ఉన్న పెట్టుబడి, పెట్టుబడి ఆవర్తం (turnover) గురించి సాధ్యమైనంత సంతృప్తికరంగా ముసాయిదా రూపొందించే ప్రయత్నంలో భాగంగా 'వివిధ రకాల పెట్టుబడులు, పెట్టుబడుల భాగాలు, రాబడి (=m) సామాజికంగా పెనవేసుకున్న తీరును పరిశోధించడానికి ఆయన కృషి ప్రారంభించాడు. వాల్యూమ్ 3లో 'అదనపు విలువ వివిధ రూపాలుగా, ప్రత్యేక భాగాలుగా మారడం' ఉంటాయని ప్లాన్‌లో వివరించాడు.

ఏది ఏమైనప్పటికీ మే నెలలో మళ్లీ అనారోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. కొంతకాలం మౌనం వహించిన తరువాత, 'వృషణంపై లేచిన రెండు వ్రణాలు తీవ్రంగా బాధిస్తున్నాయని' ఎంగెల్స్‌కు తెలియజేశాడు. ఆగస్ట్ రెండో వారంలో 'పుస్తకమంతా 1869 సెప్టెంబర్ చివరకు పూర్తి చేస్తానని' కుగుల్‌మాన్‌కు తెలిపాడు. కానీ 1869 శరదృతువులో, వసంత రుతువులో వ్రణాలు తీవ్రరూపం దాల్చాయి. అప్పుడు మార్క్స్ వాల్యూమ్ 2లో మూడో చాప్టర్ రాస్తున్నాడు. వ్రణాలకు తోడు కాలేయ సమస్య కూడా తీవ్రం అయింది. ఆ తరువాత సంవత్సరాలలో ఆయనను దురదృష్టం వెంటాడుతూనే ఉంది. ఆయన వాల్యూమ్ 2ను పూర్తి చేయలేకపోయాడు.

జాప్యానికి సైద్ధాంతిక కారణాలు కూడా ఉన్నాయి. 1868 శరదృతువు నుంచి 1869 వసంతకాలం వరకు పెట్టుబడిదారీ విధానంలో వస్తున్న ఆధునిక పరిణామాలను అధ్యయనం చేయడానికి, మనీ మార్కెట్ రివ్యూ, ది ఎకనామిస్ట్ తదితర ప్రచురణల నుంచి మార్క్స్ విస్తృత సమాచారాన్ని సేకరించాడు. అంతేకాకుండా, 1869 శరత్కాలం నుంచి రష్యాలో జరుగుతున్న మార్పులపై (వాస్తవానికి, వాటికి ప్రాముఖ్యత లేకపోయి

నప్పటికీ) అవగాహన కోసం రష్యన్ భాష నేర్చుకుని స్వయంగా వాటిని అర్థం చేసుకోవాలని ఆయన నిర్ణయించుకున్నాడు. తనకు సహజమైన పట్టుదలతో రష్యన్ భాష నేర్చుకునే కార్యక్రమం కొనసాగించాడు. ఆయన భార్య జెన్నీ 1870 ప్రారంభంలో ఎంగెల్స్‌కు లేఖ రాస్తూ, 'మార్క్స్ తన గురించి ఏమీ పట్టించుకోకుండా, రష్యాలో సుత్తి, పటకారు గురించి అధ్యయనం చేయడం ప్రారంభించాడు. ఎప్పుడో గానీ బయటకు వెళ్లడం లేదు. ఎప్పుడో గానీ తినడం లేదు. చంకలో వచ్చిన వ్రణాన్ని పూర్తిగా ముదిరిపోయిన తర్వాత మాత్రమే చెబుతున్నాడు' అని వివరించింది. ఎంగెల్స్ వెంటనే మార్క్స్‌కు లేఖ రాశాడు. 'వాల్యూమ్ 2 కోసం చేస్తున్న పని చాలా ముఖ్యమైనది. దానికోసం నీ జీవనశైలిని మార్చుకోవాలి. అలా కాకుండా తరచుగా ఆ పని నిలిపివేస్తున్నందువల్ల, నువ్వు ఎన్నటికీ ఆ పుస్తకం పూర్తి చేయలేవు' అని స్పష్టం చేశాడు.

ఎంగెల్స్ వ్యక్తం చేసిన అభిప్రాయం వాస్తవమని వెంటనే తెలిసింది. వేసవిలో మార్క్స్ అంతకుముందు కొద్ది మాసాలుగా తాను చేస్తున్న కృషిని వివరిస్తూ కుగుల్‌మాన్‌కు రాసిన లేఖలో 'శీతాకాలం అంతా అనారోగ్యం కారణంగా తాను ఏ పని చేయలేక పోయానని, రష్యాలో భూమి సమస్యను అర్థం చేసుకోవడానికి, భూ యాజమాన్య సంబంధాలను ప్రాథమిక మూలాల నుంచి అర్థం చేసుకోవడానికి రష్యన్ నేర్చుకుంటున్నా నని' ఆయన వెల్లడించాడు.

ఈ ఆటంకాలతో పాటు, పారిస్ కమ్యూన్ ఆవిర్భవించడంతో ఇంటర్నేషనల్‌లో తీవ్రమైన రాజకీయ కార్యకలాపాలు కొనసాగిన తరువాత మార్క్స్ వాల్యూమ్ 1 కొత్త ఎడిషన్ పని ప్రారంభించాడు. విలువ సిద్ధాంతాన్ని వివరించిన తీరుపై అసంతృప్తితో 1871 డిసెంబర్, 1872 జనవరి మాసాలలో 1867లో ప్రచురించిన అనుబంధాన్ని పూర్తిగా తిరగరాశాడు. దీనివల్ల మొదటి చాప్టర్ మొత్తాన్ని కూడా తిరగరాయవలసి వచ్చింది. ఈ సందర్భంగా మార్పులు చేర్పులు చేసే క్రమంలో పుస్తకం నిర్మాణ స్వరూపాన్ని పూర్తిగా మార్చివేశాడు.

సవరణలు, తిరగరాయడం వల్ల పుస్తకం ఫ్రెంచ్ అనువాదానికి కూడా ఇబ్బంది వచ్చింది. 1872 నుంచి 1875 వరకు పబ్లిషర్‌కు విడతలవారీగా పంపిన ముసాయిదా లను సరిదిద్దే పని మార్క్స్ 1872 మార్చి నుంచి ప్రారంభించాడు. సరిదిద్దటంలో భాగంగా పుస్తకంలో మరిన్ని మార్పులు చేయాలని, ప్రత్యేకించి పెట్టుబడి సంచయం చాప్టర్‌లో మార్పులు చేయాలని నిర్ణయించాడు. ఫ్రెంచ్ అనువాదం చివరి మాటలో 'ఒరిజినల్ కన్నా ఇది శాస్త్రీయమైనది' అని చెప్పడానికి కూడా ఆయన వెనకాడలేదు.

ఇంతకు ముందు కంటే అనారోగ్య తీవ్రత స్వల్పంగా తగ్గినప్పటికీ, కొన్ని అంశాలకు సంబంధించి తన పరిజ్ఞానం పెంచుకోవాలని అనుకుంటున్నప్పటికీ – మార్క్స్ క్యాపిటల్ పుస్తకం పనిని చివరి రోజులలో కూడా కొనసాగించాడు. 1875లో 'అదనపు విలువ నిష్పత్తి, లాభం నిష్పత్తి సంబంధం' శీర్షికతో గణిత రూపంలో అభివృద్ధిచేసి వాల్యూమ్ 3కు మరో ముసాయిదా రాశాడు. 1876 అక్టోబర్ నుంచి 1881 మధ్య కాలంలో వాల్యూమ్ 2లోని కొన్ని సెక్షన్లకు ముసాయిదా రాశాడు. తాను నిర్విరామంగా కొనసాగిస్తున్న పరిశోధన ఫలితాలను అనుసరించి వాల్యూమ్ 1ని కూడా తిరగరాయవలసి ఉంటుందని ఆయన ఈ కాలంలో రాసిన లేఖలను బట్టి తెలుస్తుంది.

మార్క్స్ తన జీవిత కృషిలో ప్రధానమైన పుస్తకం (Magnum Opus) 'క్యాపిటల్' రాసేటప్పుడు నిశిత విమర్శనాత్మక విధానాన్ని అనుసరించాడని, అందులో ఎటువంటి మూఢనమ్మకాలకు తావివ్వలేదని స్పష్టంగా అర్థమవుతుంది. కానీ ఆయన అనుయాయులు, లేదా వ్యతిరేకులలో ఎక్కువమంది ఇటువంటి విమర్శనాత్మక పద్ధతిని అనుసరించ లేకపోయారు. గుడ్డినమ్మకస్తులయ్యారు. అసంపూర్తిగానే ఉన్నప్పటికీ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేయడానికి అవసరమయ్యే మౌలిక సిద్ధాంతం కోసం మార్క్స్ రాసిన 'క్యాపిటల్' చదవక తప్పదు.

Karl Marx Pettubadi Grandham - Puttuka, Nirmanam

by Marcello Musto

Translated by Sunkara Ramachandra Rao



Marcello Musto

కెనడాలోని యార్క్ విశ్వవిద్యాలయంలో మార్సెల్లో మస్తో సామాజిక శాస్త్ర ఆచార్యునిగా పనిచేస్తున్నారు. ఇటలీలో జన్మించిన మస్తో గత దశాబ్ద పైచిలుకుగా మార్క్స్ అధ్యయనాన్ని పునరుద్ధరించడంలో అంతర్జాతీయంగా కీలకమైన పాత్ర నిర్వహిస్తున్నారు. ఇతని ఇటీవల రచనలలో ముఖ్యమైనది 'ది లాస్ట్ ఇయర్స్ ఆఫ్ కారల్ మార్క్స్ : యాన్ ఇంటెలెక్చువల్ బయోగ్రఫీ' (2020). అలానే 'యనదర్ మార్క్స్ : ఎర్లీ మాన్యుస్క్రిప్ట్స్ టు ది ఇంటర్నేషనల్' (2018). మార్క్స్ పెట్టుబడి గ్రంథ అధ్యయనాన్ని సాగించిన క్రమాన్ని, తీరును చాలా లోతుగా విశ్లేషించిన మస్తో పరిశోధనా వ్యాసపు తెలుగు అనువాదాన్ని ఇక్కడ తెలుగు పాఠకలోకానికి అందిస్తున్నాం.

డాక్టర్ సుంకర రామచంద్రరావు ఈ వ్యాసాన్ని తెలుగులో అనువదించారు. మస్తో రాసిన 'మొదటి ఇంటర్నేషనల్ చరిత్ర'ను రామచంద్రరావు 2016లో అనువదించారు.

వెల : ₹30/-

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004